MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 299 | పేజీలు : 8 | ఆదివారం 18 అక్టోబర్ 2026 | వెల : 6-00



దుర్గా పూజా మండపంలో
తొక్కిసలాట

17 మంది మృతి.. 25 మందికి పైగా గాయాలు..
ఆసుపత్రులకు తరలింపు
సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. ఘటనపై విచారణ

- వర్షంతో ఒక్కసారిగా పెరిగిన భక్తుల రద్దీ
- చోర్‌బగాన్ దుర్గా పూజా మండపం వద్ద విషాదం
- తొక్కిసలాటలో పలువురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను కోల్‌కతా మెడికల్ కాలేజీకి తరలింపు
- రంగంలోకి పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు
- భక్తులను అదుపు చేసేందుకు సహాయక చర్యలు

కోల్‌కతా/అమరావతి, మహానగర్

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజా వేడుకల వేళ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనీన దుర్గా పూజా మండపం వద్ద శనివారం సాయంత్రం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో తొక్కిసలాటలాంటి పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందినట్లు పలు వార్తా నివేదికలు వెల్లడించగా, పలువురు గాయపడినట్లు సమాచారం. అయితే ఘటన జరిగిన సమయంలో మృతుల సంఖ్యపై అధికారిక ధ్రువీకరణకు సంబంధించి నివేదికల్లో వ్యత్యాసాలు కనిపించాయి. మరోవైపు, కనీసం 25 మంది గాయపడినట్లు పోలీసులు వెల్లడించినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. - మిగతా 2లో





న్యాయం కోసం
నిలబడండి

- విద్యార్థులకు సీజేఐ సూర్యకాంత్ సూచన
- న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు న్యాయం కోసం నిలబడాలి
- రాజ్యాంగ విలువలను కాపాడాలని
- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సూచన
- వృత్తిలో నిజాయతీగా ఉంటూ, ఇతరుల సమస్యలను అర్థం చేసుకోవాలి

5



సీఆర్పీఎఫ్ జవాన్లకు
గుడ్ న్యూస్

- సీఆర్పీఎఫ్‌లో లాన్స్ నాయక్, నాయక్ ర్యాంకుల పునరుద్ధరణకు యోచన
- జవాన్ల పదోన్నతుల్లో జాప్యాన్ని తగ్గించేందుకు కీలక ప్రతిపాదన
- దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దయిన ర్యాంకులను మళ్లీ తెచ్చేందుకు కసరత్తు
- త్వరలో దళంలో చేరనున్న అగ్నివీరులకు లబ్ధి చేకూర్చే అవకాశం
- దేశవ్యాప్తంగా సైనిక్ సమ్మేళన్ల ద్వారా అభిప్రాయ సేకరణకు ఆదేశం

ఆధ్యాత్మిక పర్యాటకంలో ఏపీతో
కలిసి పనిచేస్తాం

- మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్
- ఆధ్యాత్మిక పర్యాటకంలో ఏపీ-మధ్యప్రదేశ్ భాగస్వామ్యం
- అమరావతి నిర్మాణంపై మోహన్‌యాదవ్ ఆసక్తి
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో అభివృద్ధి అంశాలపై చర్చలు
- పులుల సంరక్షణ, అడవి దున్నుల పునఃప్రవేశంపై ప్రత్యేక దృష్టి



అమరావతి, మహానగర్


ఏపీ, మధ్యప్రదేశ్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, ఆధ్యాత్మిక పర్యాటకంలో కలిసి పనిచేస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి, విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మాట్లాడారు. సాయంత్రం ఆయన అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. మోహన్‌యాదవ్‌కు సీఆర్డీఏ - మిగతా 2లో



పులివెందులలో
విధ్వంసం

- గుంపును నామినేషన్ కేంద్రంలోకి అనుమతించలేదని పోలీసులపై రాళ్లవర్షం
- టియర్ గ్యాస్ ప్రయోగం.. గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు
- వైకాపా కార్యకర్తకు బులెట్ గాయం
- రాయచోటిలో రెండో రోజూ దాడులు
- కడప, మైదుకూరు, రాజంపేటల్లోనూ ఉద్రిక్తత
- పులివెందులలో ఏకే 47 గన్‌తో గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

2లో



ఆన్‌లైన్ గేమింగ్
ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు...
- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు

5

ఇంద్రకీలాద్రిపై
భక్తజన సందోహం

- శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనం
- వైభవంగా ఆదిదంపతుల నగరోత్సవం
- భవానీల రాకతో పెరిగిన రద్దీ
- మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రత్యేక పూజలు
- అమ్మవారిని దర్శించుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు

2లో



ఇంద్రకీలాద్రిపై భక్తజన సందోహం





విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిభావంతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజైన శనివారం శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సిరిసంపదలు, సౌభాగ్యం, సుఖసంతోషాలను ప్రసాదించే జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు, భవానీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగింది. కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం వివిధ శాఖల సేవలను సమన్వయం చేసింది. దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఆధ్వర్యంలో దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణను పర్యవేక్షించగా, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆధ్వర్యంలో పోలీసులు భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. వాలంటీర్లు భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయగా, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ బృందాలు సేవలందించాయి. వైద్య బృందాలు ప్రాథమిక చికిత్స అందించేందుకు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. శనివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో కలిసి సినీ ప్రముఖులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న వారు అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ కూడా ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేద పండితులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనా నాయక్ తదితరులు ముఖ్యమంత్రికి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించిన ఆదిదంపతుల నగరోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయం నుంచి ప్రారంభమైన ఉత్సవ రథయాత్ర రథం సెంటర్, వినాయకుడి గుడి, కెనాల్ రోడ్డు మీదుగా దుర్గా ఘాట్‌కు చేరుకుని, అనంతరం ఘాట్ రోడ్డు మార్గంలో కొండపైకి సాగింది. శాక్సోఫోన్ స్వరాలు, కేరళ పంచవాద్యాల దరువులు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, మహిళల కోలాటాలతో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం మహారాజగోపురం వద్ద ఉత్సవమూర్తులకు వేదోక్తంగా ఆస్థాన సేవ నిర్వహించి, అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించారు. ఇదే సందర్భంగా శ్రీ మల్లికార్జున మహామండపంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అధ్యక్షతన అర్చక సత్కార కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయ సంప్రదాయాల కొనసాగింపు, సమాజ శ్రేయస్సులో అర్చకుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు యనమంద్ర మల్లేశ్వర శాస్త్రి, లింగంభొట్ల దుర్గాప్రసాద్ శర్మ, కుందుర్తి కనక సుందర శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అర్చకులకు శాలువాలు కప్పి, ప్రసాదాలు అందజేసి సత్కరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా పూజలు, నగరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి.

పులివెందులలో విధ్వంసం

పదుల కొద్దీ వాహనాలు.. అందులో తుపాకులు పట్టుకున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది.. వందల సంఖ్యలో మందీ మార్బలం.. నామినేషన్ వేయడానికి వెళ్తున్నామనే పేరుతో వైకాపా శ్రేణులు యుద్ధ వాతావరణాన్నే సృష్టిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అలజడులు రేకెత్తించడమే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. శుక్రవారం పుంగనూరులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి తమ అనుచరులతో కలిసి అరాచకం సాగించారు. శనివారం పులివెందులలో వైకాపా అధ్యక్షుడు జగన్ సోదరుడు, ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో విధ్వంసకాండకు తెగబడ్డారు. ఏకంగా పోలీసులపైనే రాళ్ల దాడులకు దిగారు. పరిస్థితిని అదుపు చేసేందుకు రెండు దఫాలుగా గాలిలోకి కాల్పులు జరపడంతోపాటు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో వేముల మండలానికి చెందిన వైకాపా కార్యకర్తకు బులెట్ గాయమైంది. కడప నగరంతో పాటు రాజంపేట, మైదుకూరు ప్రాంతాల్లో వైకాపా, తెదేపా శ్రేణులు పరస్పర దాడులకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్ పత్రాలు లాక్కుని చించివేయడంతోపాటు.. కత్తులతో దాడులు, పరస్పరం రాళ్లు రువ్వుకోవడం తదితర ఘటనలకు పాల్పడ్డారు. తిరుపతిలో తెదేపా నాయకులు నామినేషన్ వేసేందుకు వచ్చిన వైకాపా నాయకుల నుంచి పత్రాలు లాక్కుని చించి వేశారు.

పులివెందుల రణరంగం

పులివెందుల పురపాలక ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులతో నామినేషన్ వేయించేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం భారీ ర్యాలీగా బయలుదేరారు. అప్పటికే నామినేషన్ కేంద్రంలో తెదేపా అభ్యర్థి ఉండటంతో నిబంధనల ప్రకారం పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీంతో వైకాపా శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులపై రాళ్ల వర్షం కురిపించాయి. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో పోలీసులు మొదటి విడతగా 6 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వైకాపా శ్రేణులు వెనక్కి తగ్గకపోవడంతో బాష్పవాయువు (టియర్ గ్యాస్) ప్రయోగించారు. పరిస్థితిని సమీక్షించేందుకు వచ్చిన జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌పైనా వైకాపా కార్యకర్తలు రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు మరో 10 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి గుంపును వెనక్కి నెట్టారు. అప్పటికే నామినేషన్లకు గడువు సమయం ముగియడంతో ఎంపీ అవినాష్‌రెడ్డి తన అనుచరులతో వెనుదిరిగారు.

రాయచోటిలో రెండో రోజూ విధ్వంసం

రాయచోటిలో రెండో రోజూ వైకాపా, తెదేపా వర్గాల మధ్య దాడులు జరిగాయి. వైకాపా నాయకులతో పాటు పంజాబ్‌కు చెందిన బౌన్సర్లు, రౌడీలు మకాం వేసి విధ్వంసాలకు పాల్పడుతున్నారనే సమాచారంతో తెదేపా శ్రేణులు మదనపల్లె రోడ్డులోని ఓ హోటల్ వద్దకు వెళ్లడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి.

కడపలో కత్తిపోట్లు

కడప కార్పొరేషన్ పరిధిలోని పలు నామినేషన్ కేంద్రాల వద్ద వైకాపా, తెదేపా కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. కాగితాలపెంట నామినేషన్ కేంద్రం వద్ద వైకాపా మహిళా అభ్యర్థికి మద్దతుగా వచ్చిన మురాద్‌బాషాపై తెదేపా శ్రేణులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. సెయింట్ జోసెఫ్ నామినేషన్ కేంద్రంలో వైకాపా అభ్యర్థి దయాజ్‌పై ప్రత్యర్థులు దాడి చేసి, నామినేషన్ పత్రాలను చించివేశారు. నాగరాజపేటలో వైకాపా అభ్యర్థి సలీంపై దాడి జరిగింది. పోలీసులు లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు.

ఎల్ నినో దెబ్బ.. అందని ద్రాక్షగా మారిన సీతాఫలం..

మార్కెట్‌లో కనిపించని జాడ

శీతాకాలం ప్రారంభమైందంటే చాలు పల్లె గుట్టల్లో, రోడ్ల వెంట, మార్కెట్లలో సీతాఫలాలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సీతాఫలం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిపోయింది. చలికాలం మొదలై దాదాపు నెల కావస్తున్నా ఇంకా మార్కెట్లో సీతాఫలాల జాడ మాత్రం కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం కాపు తగ్గిపోవడం. అవును, ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు లేక, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పట్టిన పూత పిందె దశకు కూడా రాకముందే వాడిపోతోంది.

దీనివల్ల దిగుబడి చాలా వరకు తగ్గిపోయింది. దానికి తోడు చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో సహజంగా పెరిగే చెట్లను నరికివేయడంతో సీతాఫలాల దిగుబడి మరింత పడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సీతాఫలాల సాగు కొనసాగుతోంది. అయితే అక్కడి నుంచి మార్కెట్‌కు వచ్చే పండ్లకు కూడా డిమాండ్ భారీగా పెరిగిపోయింది. సరఫరా తగ్గి డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం మార్కెట్లో సీతాఫలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్‌లో ఒక్కో పండు నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు పలుకుతోంది.



దీంతో సామాన్యులు వీటిని కొనేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు.

పూత దశలోనే దెబ్బ

సాధారణంగా వర్షాకాలంలో కురిసే వర్షాల వల్ల భూమిలో తేమ పెరిగి, శీతాకాలం నాటి పరిస్థితులకు అనుగుణంగా సీతాఫలాల దిగుబడి ఉంటుంది. ఇవి ఎక్కువగా కాయాలంటే వర్షంతో పాటు నేలలో తేమ కూడా చాలా అవసరం. కానీ గడిచిన వర్షాకాల సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు కూడా భారీగా పెరగడంతో చెట్టుకు పూసిన పూత పిందె దశకు చేరకుండానే నేలరాలిపోతోంది. కొన్ని చెట్లు ఈ దశను దాటి కాయ వరకు వచ్చినా, ఆ తర్వాత ఎండిపోయి రాలిపోతున్నాయి. దీనివల్ల సాధారణంగా చెట్టుకు 50-60 వరకు కనిపించాల్సిన కాయలు ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయి.

ఇది కూడా ప్రధాన కారణం..

సీతాఫలాల లభ్యత తగ్గడానికి కేవలం వాతావరణ పరిస్థితులు మాత్రమే కారణం కాదు. సీతాఫలం చెట్లు ఎక్కువగా పెరిగే ప్రాంతాలను అభివృద్ధి పేరుతో చదును చేసి వెంచర్లు వేయడం, కళాశాలలు, భవనాలు నిర్మించడం కూడా వాటి ఉత్పత్తికి ఆటంకంగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సీతాఫలాల లభ్యత మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దుర్గా పూజా మండపంలో తొక్కిసలాట..

-మొదటిపేజీ తరువాయి

క్షతగాత్రులను కోల్‌కతా మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పండుగ వేళ చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.

వర్షం మొదలవడంతో ఒక్కసారిగా ముందుకు కదిలిన భక్తులు

దుర్గా పూజ సందర్భంగా చోర్‌బగాన్ మండపానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుర్గామాతను దర్శించుకునేందుకు చాలామంది బయట వేచి ఉన్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వర్షం ప్రారంభమైంది. వర్షం నుంచి తప్పించుకునేందుకు బయట ఉన్న భక్తులు ఒక్కసారిగా మండపం వైపు కదలడంతో రద్దీ తీవ్రంగా పెరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు రావడంతో కొందరు అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాటలాంటి పరిస్థితి ఏర్పడింది. భక్తుల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి కొంతసేపు గందరగోళంగా మారింది. కిందపడిన వారిని పైకి లేపేందుకు ఇతరులు ప్రయత్నించినప్పటికీ, భారీ రద్దీ కారణంగా ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం. ఈ పరిణామంలో పలువురు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు, మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి.

ఆసుపత్రులకు క్షతగాత్రుల తరలింపు

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది స్పందించారు. గాయపడిన వారిని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చి అంబులెన్సులు, అందుబాటులో ఉన్న ఇతర వాహనాల ద్వారా ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు పేర్కొన్నాయి. బాధితులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది చర్యలు చేపట్టారు.
గాయపడిన వారిని కోల్‌కతా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు కూడా పరిస్థితిని సమీక్షించినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. బాధితులకు అవసరమైన వైద్యం అందించడంపై అధికారులు దృష్టి సారించారు.

రంగంలోకి విపత్తు నిర్వహణ బృందాలు

ఘటన జరిగిన ప్రాంతానికి పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మండపం పరిసరాల్లో ఏర్పడిన గందరగోళాన్ని అదుపులోకి తీసుకురావడంతో పాటు, గాయపడిన వారిని గుర్తించి ఆసుపత్రులకు తరలించే ప్రక్రియను కొనసాగించారు. ప్రమాదం తర్వాత భక్తుల రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. మరింత మంది ప్రజలు అక్కడికి చేరితే పరిస్థితి మళ్లీ అదుపుతప్పే ప్రమాదం ఉండటంతో మండపం వద్ద రద్దీని నియంత్రించడంపై పోలీసులు దృష్టి పెట్టారు. సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించే ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

ముఖ్యమంత్రి ఆసుపత్రిలో పరామర్శ

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు కూడా పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. బాధితులకు వైద్యసేవలు అందించే విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన తీరుపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భక్తుల రద్దీ, వర్షం సమయంలో ఏర్పడిన పరిస్థితులు, ప్రవేశ మార్గాల వద్ద రాకపోకల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంది. ఘటనకు గల ఖచ్చితమైన కారణాలపై అధికారిక విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రధాని సంతాపం.. పరిహారం ప్రకటన

కోల్‌కతా దుర్గా పూజా మండపం వద్ద జరిగిన విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేసినట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ విషాద ఘటనతో దుర్గా పూజా వేడుకల సందర్భంగా భక్తుల భద్రత, జనసమ్మర్థాన్ని నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే ఏర్పాట్లపై మరోసారి చర్చ మొదలైంది.

భక్తుల భద్రతపై ప్రశ్నలు

పండుగలు, జాతరలు, మతపరమైన వేడుకల సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకేచోట చేరడం సాధారణం. ఇలాంటి సందర్భాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేయడం, జనసమ్మర్థాన్ని నిరంతరం పర్యవేక్షించడం, వర్షం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అత్యంత కీలకం. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఒకేసారి ముందుకు కదలకుండా నియంత్రించేందుకు తగిన సిబ్బంది, స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. చోర్‌బగాన్ ఘటనలో వర్షం కారణంగా బయట వేచి ఉన్న భక్తులు ఒక్కసారిగా ముందుకు కదలడం ప్రమాదకర పరిస్థితికి దారితీసినట్లు ప్రాథమిక సమాచారం సూచిస్తోంది. అయితే భద్రతా ఏర్పాట్లలో ఏవైనా లోపాలు ఉన్నాయా? జనసమ్మర్థాన్ని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రమాద సమయంలో సహాయక చర్యలు ఎలా కొనసాగాయి? అనే అంశాలపై అధికారిక విచారణ ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

విషాదంలో మునిగిన కోల్‌కతా

దుర్గామాత దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రమాదంలో చిక్కుకోవడంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం కొందరు ఆసుపత్రుల వద్ద ఆందోళనగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. పండుగ సందర్భంగా ఆనందోత్సాహాలతో నిండాల్సిన ప్రాంతంలో ఈ ప్రమాదం కలకలం రేపింది. ప్రస్తుతం బాధితులకు వైద్యసేవలు అందించడం, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించడం, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టడం అధికారుల ముందున్న ప్రధాన బాధ్యతలుగా నిలిచాయి. మృతుల సంఖ్య, గాయపడిన వారి పరిస్థితి, ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

ఆధ్యాత్మిక పర్యాటకంలో ఏపీతో కలిసి పనిచేస్తాం

-మొదటిపేజీ తరువాయి

కమిషనర్ వి.విజయరామరాజు, అదనపు కమిషనర్లు ఎ.భార్గవతేజ, టి.రాహుల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. సీఆర్డీఏ కార్యాలయంలోని మొదటి అంతస్తులో అధికారులతో ఆయన భేటీ అయ్యి అమరావతి నిర్మాణం గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మోహన్‌యాదవ్ సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో శనివారం ఈ సమావేశం జరిగింది. రాష్ట్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అమరావతి నిర్మాణం గురించి చంద్రబాబు ఆయనకు వివరించారు. ప్రతిపక్షంలో తాను నిర్వహించిన యువగళం పాదయాత్ర వివరాల్ని మోహన్‌యాదవ్‌కు మంత్రి లోకేశ్ తెలియజేశారు. అంతకుముందు మోహన్‌యాదవ్‌కు చంద్రబాబు, లోకేశ్ స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి, శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు.

పవన్‌కల్యాణ్‌తోనూ సమావేశం

మంగళగిరిలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తోనూ మోహన్‌యాదవ్ భేటీ అయ్యారు. ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై ఇద్దరూ మాట్లాడుకున్నారు. నాగార్జునసాగర్- శ్రీశైలం అభయారణ్యం పరిధిలో పులుల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేసే అంశాన్ని పవన్‌కల్యాణ్ ప్రస్తావించారు. ఈ అటవీ ప్రాంతంలో గౌర్ (అడవి దున్నుల) పునఃప్రవేశానికి సంబంధించిన ఒప్పందాన్ని త్వరగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలియజేశారు

ప్రోటోకాల్ దర్శనం, వాహనాల పాసుల నిబంధనల్లో మార్పులు

విజయవాడ, మహానగర్

దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రోటోకాల్ దర్శనం, వాహనాల పాసుల జారీ విషయంలో ఉత్సవ అధికార యంత్రాంగం నిర్ణయం మేరకు కీలక మార్పులు చేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ వెల్లడించారు. సవరించిన నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ దర్శనానికి గతంలో రాత్రి 7.45 నుంచి 9.45 గంటల వరకు కేటాయించిన సమయాన్ని రద్దు చేసి, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉన్న దర్శన సమయాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. డ్రాప్, పికప్ వాహనాల పాసులను స్వయంగా ప్రయాణించే, అర్హతను ధ్రువీకరించిన ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. డ్రాప్ పాసులు కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ రిసెప్షన్ పాయింట్ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. ఈ పాసులు కలిగిన వాహనాలకు ఘాట్ రోడ్డుపైకి అనుమతి ఉండదని తెలిపారు. ప్రోటోకాల్ ప్రముఖులు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కొండపై ఓం టర్నింగ్ వరకు చేరుకోవాలని, దర్శనం అనంతరం దేవస్థానం వాహనాల్లోనే తిరిగి కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ రిసెప్షన్ పాయింట్‌కు రావాలని సూచించారు. సంబంధిత సిబ్బంది ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, పాసులు పొందే వారికి ప్రవేశ పరిమితులపై ముందుగానే స్పష్టమైన సమాచారం అందించాలని కమిషనర్ ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఈనెల 28న స్థానిక సెలవు

అమరావతి, మహానగర్

రాష్ట్రంలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 28న పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జీఓ ఆర్‌టీ నంబర్ 1285ను అక్టోబర్ 17న విడుదల చేసింది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు జిల్లా కలెక్టర్లు సెలవు ప్రకటించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా సెలవు కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం కూడా పోలింగ్ రోజున స్థానిక సెలవు ప్రకటించేందుకు కలెక్టర్లకు అధికారం ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 1988 ప్రకారం పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించే అధికారాన్ని కార్మిక శాఖ కమిషనర్‌కు అప్పగించింది. పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజున సెలవు ప్రకటించేందుకు కూడా కలెక్టర్లకు అనుమతిచ్చింది. సంబంధిత జిల్లా కలెక్టర్లు, పట్టణ స్థానిక సంస్థల కమిషనర్లు, కార్మిక శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

నిజాయితీతో విధులు నిర్వహించాలి

ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా

ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 147 మంది అధికారులు

146 మంది ఎస్ఐల్లో 41 మంది మహిళలు



హైదరాబాద్, మహానగర్

ఎక్సైజ్ శాఖలో నూతనంగా నియమితులైన అధికారులు నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రెవెన్యూ (ఎక్సైజ్), గనులు, భూగర్భశాఖల ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా పిలుపునిచ్చారు. నిషేధ, ఎక్సైజ్ చట్టాలను సమర్థంగా అమలు చేస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హిమాయత్‌సాగర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆరు నెలల ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌కు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విధుల నిర్వహణలో జవాబుదారీతనం, వృత్తి నైపుణ్యాన్ని పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ చట్టాలను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ, చట్టాల ఉల్లంఘనలను అరికట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 147 మంది అధికారులు శిక్షణ పూర్తి చేసుకోగా, వారిలో 146 మంది నేరుగా నియమితులైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒకరు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏపీఈఎస్) ఉన్నారు. 146 మంది ఎస్ఐల్లో 41 మంది మహిళలు, 105 మంది పురుషులు ఉన్నారు. శిక్షణ అనంతరం అధికారులు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి శిక్షణ పొందనున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్ల సందడి

విజయవాడ, మహానగర్

జిల్లాలోని ఐదు పట్టణ స్థానిక సంస్థల్లో శనివారం వార్డు సభ్యుల స్థానాలకు 396 నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టికలో చూపిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వారీ మొత్తం నామినేషన్ల సంఖ్య 419గా నమోదైంది. విజయవాడ నగరపాలక సంస్థలో ఆ రోజు 242 నామినేషన్లు దాఖలు కాగా, మొత్తం 261 నమోదయ్యాయి. జగ్గయ్యపేటలో 37, తిరువూరులో 65, నందిగామలో 37, కొండపల్లిలో 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ పట్టణాల్లో పట్టికలో చూపిన మొత్తం నామినేషన్ల సంఖ్య వరుసగా 37, 67, 38, 16గా ఉంది. పార్టీలు, అభ్యర్థుల వారీగా మొత్తం 419 నామినేషన్లలో వైఎస్సార్‌సీపీకి 187, టీడీపీకి 144, జనసేనకు 46, స్వతంత్ర అభ్యర్థులకు 22, బీజేపీకి 7, సీపీఐకి 6, సీపీఎంకు 3, కాంగ్రెస్‌కు 3, ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక నామినేషన్ నమోదైంది. మేయర్/చైర్‌పర్సన్ స్థానాలకు శనివారం తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు పట్టికలో పేర్కొనగా, పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వారీగా మొత్తం నామినేషన్ల సంఖ్య 10గా నమోదైంది. ఇందులో టీడీపీ నుంచి 2, వైఎస్సార్‌సీపీ నుంచి 3, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 4 నామినేషన్లు ఉన్నాయి.

విజయవాడ ఉత్సవ్ 2.0లో సినీ తారల సందడి

ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక మందాన

'కనకదుర్గ' సినిమా విశేషాలతో హీరో అల్లరి నరేష్, నటుడు సుబ్బరాజు





విజయవాడ, మహానగర్

నగరంలో ఘనంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0లో ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందాన, హీరో అల్లరి నరేష్, నటుడు సుబ్బరాజు పాల్గొని సందడి చేశారు. మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందాన విజయవాడ నగరంపై తమకున్న ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారు. నగర ప్రత్యేకతలు, ప్రజల ఆత్మీయత గురించి మాట్లాడారు. పెళ్లి తర్వాత జరుపుకున్న తొలి దసరా పండుగ విశేషాలను అభిమానులతో పంచుకున్నారు. తాము కలిసి నటిస్తున్న 'రణబాలి' సినిమా గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. మరోవైపు హీరో అల్లరి నరేష్, ప్రముఖ నటుడు సుబ్బరాజు 'కనకదుర్గ' సినిమా విశేషాలతో కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ అభిమాన నటీనటులను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపించడంతో ఉత్సవ ప్రాంగణంలో సందడి నెలకొంది. విజయవాడ నగర వైభవం, ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0లో సినీ ప్రముఖుల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినోదంతోపాటు నగర సాంస్కృతిక ప్రతిష్ఠను పెంపొందించేలా ఉత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

కోహినూర్ వజ్రం తిరిగి భారత్‌కు రావాలి

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

విజయవాడ ఉత్సవ్ 2.0లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధ్యప్రదేశ్ సీఎం

హాజరైన చైనా రాయబారి జు ఫీహోంగ్



విజయవాడ, మహానగర్

కోహినూర్ వజ్రం తిరిగి భారత్‌కు రావాలని, కృష్ణా తీర ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఆకాంక్షించారు. నగరంలో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ 2.0లో భాగంగా శనివారం పున్నమి ఘాట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయనకు తెలుగు సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమానికి చైనా రాయబారి జు ఫీహోంగ్, ఆయన సతీమణి టాన్ యుక్సియు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ యాదవ్ మాట్లాడుతూ, కృష్ణా తీర ప్రాంతానికి వజ్ర సంపదతో చారిత్రక అనుబంధం ఉందనే ప్రతీతి ఉందని, కోహినూర్ వజ్రం తిరిగి భారత్‌కు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడలో ఇంతటి అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకోవడం, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలను తిలకించడం తనకు ఆనందాన్ని కలిగించిందన్నారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో కళాకారులు అందించిన ప్రదర్శనలు భారతీయ వారసత్వ వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మధ్యప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆహ్వానం పలికారు. విజయవాడలోని నున్న మామిడి మార్కెట్ గురించి ప్రస్తావిస్తూ, ఇక్కడి మామిడి పండ్లకు మంచి పేరుందని, నాణ్యమైన పండ్లను అందిస్తున్న రైతులను అభినందిస్తున్నానని తెలిపారు. అనంతరం సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ప్రతినిధులు నరసింహారావు, ముత్తవరపు మురళి ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను ఘనంగా సత్కరించి కొండపల్లి బొమ్మ, ఆయన చిత్రపటం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున రూపొందించిన జ్ఞాపికను అందజేశారు. మరోవైపు ప్రముఖ గాయని సునీత తన మధురమైన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించగా, వివిధ నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించేలా కాకుండా, భారతీయ కళలు, సంప్రదాయాలు, స్థానిక ప్రతిభకు వేదికగా విజయవాడ ఉత్సవ్ 2.0 నిలిచింది.

గల్ఫ్‌పై మిట్టపల్లి బతుకమ్మ పాట

హైదరాబాద్, మహానగర్



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని గల్ఫ్ దేశాలకు చాటిచెప్పేలా "ఎడారిలో తంగేడు వనమే మొలిసేనో" అంటూ రూపొందించిన బతుకమ్మ పాట దుబాయ్‌లో ఘనంగా ఆవిష్కృతమైంది. అక్షర గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కోట కుమార్ (కేకే) నిర్మించిన ఈ గీతానికి ప్రముఖ తెలంగాణ ప్రజాకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ సాహిత్యం అందించగా, ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించారు. మదీన్ ఎస్కే నేపథ్య సంగీతం సమకూర్చారు. పొట్టచేత పట్టుకుని గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల ఆవేదనను, పండుగ వేళ సొంత ఊరిలో కుటుంబ సభ్యులతో గడపాలనే ఆకాంక్షను ఈ పాట ప్రతిబింబిస్తుంది. బతుకమ్మ పండుగకు దూరంగా ఉంటున్న తెలంగాణ ఆడబిడ్డలు, అన్నదమ్ములకు స్వగ్రామ జ్ఞాపకాలను గుర్తుచేసేలా గీతాన్ని రూపొందించారు. దూద్ సేమియా, సత్తు బెల్లం, ఖర్జూరపు తీపి వంటి అంశాలను మేళవిస్తూ హిందూ-ముస్లిం సోదరభావం, మతసామరస్య సందేశాన్ని ఈ పాట ద్వారా చాటిచెప్పారు. గోల్కొండ కోట నుంచి బుర్జ్ ఖలీఫా వరకు ఏడు దేశాల అనుబంధాన్ని ఏడు రంగుల బతుకమ్మతో ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. మిట్టపల్లి స్టూడియో రూపొందించిన ఈ పాటను తెలంగాణతో పాటు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలకు అక్షర గ్రూప్స్ చైర్మన్ కోట కుమార్ అంకితం చేశారు. వేడుకల్లో తెలంగాణ నుంచి వచ్చిన సంప్రదాయ డప్పు, ఒగ్గుడోలు బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుబాయ్, అబుదాబి నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణం - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, మహానగర్






కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ మండపంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెహెర్ నృత్య నికేతన్‌కు చెందిన 25 మంది బాలికలు తమ గురువు దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు పర్యవేక్షణలో అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అన్నమాచార్య కీర్తన 'జగడపు తనువుల జాతర'ను కోలాట రూపంలో ప్రదర్శించి అలరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో నర్తకీమణులు ప్రదర్శించిన కోలాటం, చివరలో స్వామివారు వారితో కలిసి నృత్యం చేసిన సన్నివేశం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దశావతారాలు, నందబాలం, రామదాసు కీర్తన, 'కొలువైతివా' వంటి కూచిపూడి సంప్రదాయ అంశాలతో పాటు దాదాపు 20 నృత్యాంశాలను బాలబాలికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ నృత్య కళాకారులను అభినందించారు. ఆలయ కమిటీ పెద్దలు కొల్లిపర మధు, వరదా రాజశేఖర్, వరదా హరగోపాల్, దింటకుర్తి జ్యోతి, తమ్మన సతీష్ కుమార్ నాట్యాచార్యుడు మెహెర్ దుర్గా నరసింహారావును ఘనంగా సన్మానించారు. చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు.

మహానగర్

మోదీ ట్రాప్‌లో కాంగ్రెస్ !

యుద్ధరంగానికి వెళ్లేటప్పుడు శత్రువు ఎవరో, అతడి వ్యూహం ఏంటో తెలియనంత వరకు ఏ సైన్యమూ విజయ తీరాలకు చేరలేదు."ఇది రాజకీయాలకూ వంద శాతం వర్తిస్తుంది. భారత రాజకీయ చరిత్రలో శతాబ్దానికి పైగా మూలాలున్న గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్, ప్రస్తుతం తన రాజకీయ దిశనూ, దశనూ పూర్తిగా కోల్పోయిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పన్నుతున్న రాజకీయ వ్యూహాలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం దారుణంగా విఫలమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోదీ నిర్దేశించిన రాజకీయ బాటలోనే నడుస్తూ, ఆయన చేతిలో ఓ పకడ్బందీ కీలుబొమ్మలా మారిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఈవీఎంల పనితీరుపై రచ్చ చేస్తూ, భారత ఎన్నికల సంఘంపై , సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ సమరం ప్రకటించింది. ఎన్నికల సంఘాన్ని కేవలం బిజెపి మరొక అనుబంధ విభాగంగా ముద్రవేస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు తాపత్రయపడుతోంది. ఇక్కడే కాంగ్రెస్ తన ప్రాథమిక లాజిక్‌ను మిస్సయ్యింది. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఢీకొట్టాల్సింది బిజెపి అనే ప్రత్యర్థి పార్టీని మాత్రమే. కానీ ప్రజాస్వామ్య మూలస్తంభమైన ఎన్నికల సంఘాన్ని బిజెపి రూపంగా చిత్రీకరిస్తూ పోరాడటం ఎంతవరకు సమంజసం?. భారతీయ ఎన్నికల వ్యవస్థ అంత సులువుగా ఫలితాలను మార్చేసే లేదా ప్రభావితం చేసే బలహీనమైన వ్యవస్థ కాదనే సత్యం సగటు పౌరుడికి తెలుసు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పోలింగ్ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్లు , వివిధ పార్టీల ఏజెంట్లు కలసి క్షేత్రస్థాయిలో ప్రక్రియను నిర్వహిస్తారు. లక్షల సంఖ్యలో ఉండే క్షేత్రస్థాయి సిబ్బంది ఏదో ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ, ఓట్లు తీసేయడమో లేదా వేయడమో ఓ ఆదేశంతో చేయడం అసాధ్యం. అంత పెద్ద ఎత్తున అక్రమాలు చేయడం క్షేత్రస్థాయిలో సాధ్యం కాదన్న క్లారిటీ సామాన్య పౌరులకు ఉంది. కానీ, ఈ చిన్న విషయాన్ని పక్కనబెట్టి, ఎన్నికల సంఘాన్ని బూచిగా చూపిస్తూ రాజకీయం చేయడమే బిజెపి పరిచిన అసలైన ట్రాప్ . ఈ ట్రాప్‌లో పడిన కాంగ్రెస్, ప్రజా సమస్యలను వదిలేసి, ఈసీ రాజీనామాల చుట్టూ తిరుగుతూ రోజురోజుకు ప్రజలకు మరింత దూరమవుతోంది.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ , ఈసీ వ్యతిరేక ఉద్యమాల వల్ల సామాన్య ప్రజల జీవనంలో ఎలాంటి అలజడీ లేదు. విపక్షాలు చెప్తున్న ఆరోపణలతో సగటు పౌరులు ఏమాత్రం ప్రభావితం కాలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేపడుతున్న ఈ ఉద్యమాలకు ఎలాంటి ప్రజాదరణ లభించడం లేదు. స్థానిక నేతలు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు ఢిల్లీ వీధుల్లోకి వచ్చి లేదా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా, ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదు. ఇక్కడొక చేదు రాజకీయ సంకేతాన్ని కాంగ్రెస్ గమనించాల్సి ఉంది. చాలా వరకు ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అట్టడుగు స్థాయిలో ఉనికే కరువైంది. కాంగ్రెస్ పార్టీకి కొంతమేర బలం ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో, వారు చేస్తున్న ఈ ఉద్యమానికి ఉనికి లేకుండా పోయింది. పార్టీ ఉనికి ఉన్న చోట ఉద్యమానికి స్పందన లేకపోవడం, ఉద్యమం నడిపించాలని చూస్తున్న చోట పార్టీకే పునాదులు లేకపోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్ పూర్తిగా ప్రజా పునాదిని కోల్పోయిందనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం కాదా? బిజెపి విసురుతున్న తీవ్ర హిందూత్వ భావజాలాన్ని తట్టుకోవడానికి, దానికి కౌంటర్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకుంది. అగ్రనేతలు రాముడు, శివుడు అంటూ కొత్త రాజకీయం ప్రారంభించారు. శివుడు మా దేవుడు అంటూ ప్రకటనలు చేస్తున్నారు. గుళ్ల చుట్టూ తిరగడం, కొత్త దీర్ఘాలు తీయడం ప్రారంభించారు. బిజెపి నిర్మించిన అదే పిచ్‌పై బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యూహం వల్ల కాంగ్రెస్‌కు ఒరిగింది ఏమీ లేదు సరే కదా, ఉన్నది ఊడింది. సాంప్రదాయ ముస్లిం ఓటర్లలో అసంతృప్తికి ఇది కూడా ఓ కారణం. కాంగ్రెస్ అవకాశవాద హిందూత్వ ధోరణిని చూసి ముస్లింలు ఆ పార్టీకి దూరమై, సొంత ప్రాంతీయ శక్తులను ఆశ్రయిస్తున్నారు. సాఫ్ట్ హిందూత్వ నాటకాలను అసలైన హిందూ ఓటర్లు ఎంతమాత్రం నమ్మడం లేదు.ఒరిజినల్ హిందూత్వ బ్రాండ్ అందుబాటులో ఉన్నప్పుడు, నకిలీ సాఫ్ట్ వెర్షన్‌ను వారెందుకు ఆదరిస్తారు?. ఫలితంగా, బిజెపి పరిచిన మార్గంలోనే పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ తన పరిధిని నిరంతరం కుంచించుకుపోయేలా చేసుకుంటోంది.కాంగ్రెస్ పార్టీ పెద్దలు గుండెల మీద చేయి వేసుకుని, తమ సామాజిక ఓటు బ్యాంక్ పునాదులు ఎలా కదిలిపోయాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ సామాజిక వర్గం ఈ రోజు కాంగ్రెస్‌తో ఉంది?. ఓసీలు ఎప్పుడో కాంగ్రెస్ కు దూరమయ్యారు. బిజెపి లేదా స్థానిక ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్‌ను పూర్తిగా పక్కనబెట్టారు. బిజెపి సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం ఓబీసీలను తమ వైపు తిప్పుకోవడం. మిగిలిన ఓబీసీ ఓటు బ్యాంక్ ప్రాంతీయ పార్టీల చేతుల్లో ఉంది. ప్రాంతీయ పార్టీలు, కొత్తగా ఆవిర్భవించిన సొంత వర్గ నేతల ముస్లింలు వైపు వెళ్తున్నారు. దళిత, క్రైస్తవ వర్గాల్లోని ఒక భాగం మాత్రమే ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిగిలి ఉన్న బలహీనమైన ఆసరా. అంతేకాదు, కులమతాలకు అతీతంగా ఉండే సమాజంలోని మధ్యతరగతి పౌరులు, విద్యార్థులు, ఉద్యోగులు బిజెపి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వారైనా సరే? కాంగ్రెస్‌కు ఓటేయడానికి వెనుకంజ వేస్తున్నారు. బిజెపిని వ్యతిరేకించడం సరే, కానీ ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ మనల్ని మనం ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చుకోవాలా? బలహీనమైన, దిశాలేని నాయకత్వానికి రాజ్యాధికారం ఇవ్వాలా? అని సగటు మధ్యతరగతి పౌరుడు ఆలోచిస్తున్నాడు. ఈ భయాన్ని, అనుమానాన్ని పోగొట్టడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది.కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ఢిల్లీలోని ఏసీ గదులు, జంతర్ మంతర్ ధర్నాలు, లాజిక్ లేని ఈసీ వ్యతిరేక పోరాటాల నుంచి బయటకు రావలసి ఉంది. శత్రువు విసిరిన ఎరను మింగి, మోదీ పన్నిన వ్యూహాల్లోనే తిరుగుతూ మా ఓట్లు పోయాయి, వ్యవస్థలు పోయాయి అని రోదించడం వల్ల ఏ రాజకీయ పార్టీకి భవిష్యత్తు ఉండదు.ప్రజాస్వామ్యంలో ప్రజల నిజమైన సమస్యలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, గ్రామీణ ప్రాంతాల సంక్షోభం వంటి అంశాలపై నిర్మాణాత్మకంగా పోరాడకుండా, కేవలం వ్యవస్థల వైఫల్యాన్ని వేలెత్తి చూపిస్తూ కాలక్షేపం చేస్తే కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కని రోజులు ముందే ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వం రెండో సారి ప్రభుత్వంలో అంత వ్యతిరేకత ఎలా పెరిగిందో.. దాన్ని బీజేపీ ఎలా క్యాష్ చేసుకుందో ఒక్క సారి స్టడీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి తాము చేస్తున్న తప్పులేమిటో.. నడవాల్సిన బాట ఏమిటో అర్థమవుతుంది. కానీ కాంగ్రెస్‌కు అలాంటి ఆలోచనలు లేవు.పాత పునాదులు కదిలిపోయాయి.. ఉన్న ఓటు బ్యాంకులు కరిగిపోయాయి.. ప్రత్యామ్నాయ ఓటర్లు ముఖం చాటేస్తున్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకత్వం కళ్లు తెరచి, తమ వ్యూహాత్మక అంధత్వాన్ని వీడి, ప్రజాక్షేత్రంలో అసలైన రాజకీయం చేయకపోతే? సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ మహావృక్షం, మోదీ వేసిన రాజకీయంలో శాశ్వతంగా ఓటమి పాలైన ఓ సాధారణ ఆటగాడిగానే మిగిలిపోవడం ఖాయం!

నిరంతర విద్యుత్తు ఏమైపాయె?



రాష్ట్రంలో విద్యుత్తు కోతలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. వ్యవసాయానికి సరిపడా కరెంటు అందడం లేదు. రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారు.వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్తు అంతరాయాలు అదనపు భారంగా మారుతున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో పలు ప్రాంతాల్లో రైతులు నిరసనలకు దిగారు. ఈ పరిస్థితుల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా ఇప్పుడు ఏమైపోయిందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతున్నది. ప్రభుత్వం చెప్తున్న విద్యుత్తు సరఫరా లెక్కలకు, రైతులు అనుభవిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య తేడా ఎందుకు కనిపిస్తున్నది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వ పెద్దలు రాజకీయ ఆరోపణలతో ఎదురుదాడికి పాల్పడకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. రైతుల పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సరిపడా ఎరువులు దొరకక ఆందోళనలో చిక్కుకున్నారు. ఇటువంటి సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో విద్యుత్తు కోతలు మరో సంక్షోభాన్ని సృష్టించాయి. ఆ సంక్షోభంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాల్సి రావడం, మోటార్ల వద్ద వేచి ఉండటం, తక్కువ వోల్టేజీతో పంపుసెట్లు దెబ్బతినడం వంటి సమస్యలతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్తు అంతరాయాలతో పంటకు సరైన సమయంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట నష్టపోతే దాని ప్రభావం తర్వాతి సాగు పెట్టుబడులపైనా పడుతుంది. విద్యుత్తు కోతల సమస్య సాగుతోనే ఆగిపోదు. చిన్న పరిశ్రమలు, వర్క్‌షాపులు, దుకాణాలు, సేవారంగ సంస్థల పని కూడా విద్యుత్తుపై ఆధారపడుతుంది. కోతల వల్ల ఉత్పత్తి నిలిచిపోతుంది. పనివేళల నష్టం, జనరేటర్ల ఏర్పాటుతో ఖర్చులు పెరుగుతాయి. గృహ వినియోగదారులపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతుంది. ప్రజలకు అవసరమైన మేరకు విద్యుత్తును అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చూడాలి. లోటు ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేయాలి. ఇందుకోసం ప్రణాళికతో పని చేయాలి. బొగ్గు సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలి. ఉత్పత్తి కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి. ప్రసార, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయడం కూడా అంతే ముఖ్యం. విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ముందస్తు ప్రణాళిక అవసరం పెరుగుతుంది. రాష్ట్రంలో 202425 ఆర్థిక సంవత్సరంలో నమోదైన విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, 202526లో అది 18,548 మెగావాట్లకు చేరింది. అంటే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, కొనుగోళ్లు, సరఫరా వ్యవస్థలను నిరంతరం బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. ఏ ప్రాంతంలో ఎంత విద్యుత్తు సరఫరా చేస్తున్నారు? ఎంతసేపు అంతరాయాలు ఏర్పడుతున్నాయి? అందుకు కారణం ఏంటో చెప్పాలి. ఉత్పత్తి తగ్గిందా? స్థానిక లైన్లుట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? ప్రజలకు వెల్లడించాలి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్తును సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అదే స్థాయి సేవను కొనసాగించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నది? అంటే సమాధానం లేదు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు, ఉత్పత్తి కేంద్రాల పనితీరు, బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థలోని బలహీనతలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో అనసవర నిందలు వేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఈ విషయం కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి. విద్యుత్తు సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం తక్షణ, దీర్ఘకాలిక చర్యలను సమాంతరంగా చేపట్టాలి. ముందుగా వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా షెడ్యూల్‌ను గ్రామాల వారీగా ప్రకటించాలి. అనివార్యమైన అంతరాయాలు ఏర్పడితే రైతులకు ముందుగానే సమాచారం అందించాలి. సబ్ స్టేషన్లలో సరఫరా సమయాలను నమోదు చేసి, వాటిని ప్రజలకు అందుబాటులో పెట్టాలి. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తక్కువ వోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించాలి. ఓవర్‌లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలి. మరమ్మతులు, నిర్వహణను ముందస్తు స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాలి. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యం, బొగ్గు సరఫరా, విద్యుత్తు కొనుగోళ్లను సమీక్షిస్తూ నెల ముందుగానే అంచనా వేయాలి. సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడంతోపాటు, అవసరమైన చోట నిల్వ సాంకేతికతను అభివృద్ధి చేయడం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి. విద్యుత్తు సంస్థల ఆర్థిక పరిస్థితిని నిర్లక్ష్యం చేయకూడదు. సరఫరా వ్యయం, ఒప్పందాలు, బకాయిలు, రాయితీల చెల్లింపులపై పారదర్శకత అవసరం. విద్యుత్తు నాణ్యత, సరఫరా తగ్గకూడదు. ఉచిత విద్యుత్తు పథకాలు కొనసాగించాలి. అవసరమైన నిధులు, విద్యుత్తు లభ్యతపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి. అనుభవ రాహిత్యంతో వ్యవహరిస్తున్న సీఎం భేషజాలకు పోకుండా ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా కృషి చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి. ఆ ప్రగతి కొనసాగాలంటే విద్యుత్తు సరఫరాలో స్థిరత్వం ఉండాలి. ప్రభుత్వం ముందున్న పని ఒక్కటే. విద్యుత్తు సరఫరాపై ప్రకటనలు ఎన్ని చేశారనేది కాదు, ప్రజలకు నాణ్యమైన కరెంటును ఎంత నిరంతరంగా అందించారనేది ముఖ్యం. మాటల కు, చేతలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తేనే విద్యుత్తు కోతల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి.

యూత్ పెట్టే పరీక్షలో మోదీ పాసవుతారా?

హార్దిక్ పటేల్ ఎవరికైనా గుర్తున్నాడా? ఒక దశాబ్దం క్రితం వార్తా పత్రికల ఫ్రంట్ పేజీలలోను, టెలివిజన్ ప్రైమ్--టైమ్ ప్రసారాలలోనూ అతడికి చాలా ప్రాధాన్యం లభించింది. 2015లో గుజరాత్‌లో పాటీదార్ సామాజికుల ఆందోళనకు పటేల్ నాయకత్వం వహించినప్పుడు అతడి వయసు 22 సంవత్సరాలే. హార్దిక్ ర్యాలీలు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. దానికి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. అవి చివరకు 2016లో ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ నిష్క్రమణకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని సవాల్ చేసిన ఆ యువకుడు ఇప్పుడు మరో బీజేపీ ఎమ్మెల్యే! తిరుగుబాటు నుంచి పాలకపక్షం శ్రేణుల్లోకి హార్దిక్ ప్రస్థానం 'గుజరాత్ మోడల్ ఆఫ్ మేనేజింగ్ డిసెంట్' (భిన్నాభిప్రాయాలు, నిరసనలను అణచివేయడంలో గుజరాత్ విధానం)ను విశదం చేస్తుంది. ఒక ఉద్యమాన్ని రాజ్యాధికారంతో అణచివేసేందుకు మీరు ప్రయత్నించవచ్చు లేదా ఆ ఉద్యమ ప్రధాన నాయకులను అధికార రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా చేసుకోవచ్చు. నిరసనకారుడు ఒక భాగస్వామిగా మారవచ్చు, ఆందోళనకారుడు అస్మదీయుడు కాగలడు. అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఇప్పుడు ఎదుర్కోవలసిన ప్రశ్న-- బలవంతపెట్టడం లేదా కలుపుకుపోవడం, లేక ఆ రెండు పద్ధతుల కలగలుపుతో గుజరాత్‌ను పాలించిన రీతిలో విశాల భారత్‌ను పరిపాలించడం సాధ్యమేనా? ఢిల్లీలో ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకారులపై దమనకాండ ఆ సవాల్‌కు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనలను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తుగా సీజేపీ నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజలు నిరసన ప్రదేశానికి చేరకుండా అవరోధాలు కల్పించారు. వందలాది యువజనులను అదుపులోకి తీసుకుని తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లకు తరలించారు. ఈ పరిణామాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు కూడా పోలీసు ప్రతాపాలకు గురయ్యారు. సాధారణంగా ద్వైధీభావంతో వ్యవహరించే సుప్రీంకోర్టు సైతం నిరసన తెలిపే స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని మరోసారి నొక్కి చెప్పిందంటే పోలీసులు వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికంగా ఉన్నదో అర్థమవుతుంది. ప్రతిపక్షాల మరో అరాచక ఆందోళనను తాము ఎదుర్కొంటున్నట్టు మోదీ సర్కార్ విశ్వసించి ఉండవచ్చు. విపక్షాల నిరసనను పోలీసులతో అదుపుచేయవచ్చని, రాజకీయ దురుద్దేశాలతో ఆ నిరసనకు పూనుకున్నాయని కొట్టివేయవచ్చని కూడా పాలకులు భావించి ఉండవచ్చు. నిరసనల నిర్వాహకులను అరెస్ట్ చేయడం ద్వారా వాటి ప్రభావాన్ని నివారించవచ్చని వారు అనుకుని ఉండవచ్చు. అయితే ఆ అంచనా పూర్తిగా ప్రమాదకరమైన తప్పుడు ఆలోచనే. ఢిల్లీ పరిణామాలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి. ఇది సీఏఏ (పౌరసత్వ చట్ట సవరణ) వ్యతిరేక ఆందోళన కాదు. ఆ సందర్భంలో నిరసనకారులను జాతి వ్యతిరేకులు అని అధికార వర్గాలు నిత్యం నిందించాయి. వారిలో ఒకరైన ఉమర్ ఖలీద్ 2020 నుంచి జైలులో ఉన్నాడు. ఇది మూడు కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమం కూడా కాదు. ఉద్యమించిన రైతులను ప్రభుత్వం తొలుత ప్రతిఘటించింది. వారిలో కొందరు ఖలిస్థానీలు అని కూడా ఆరోపించింది. అంతిమంగా నవంబర్ 2021లో ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం మోదీ సర్కార్‌కు అనివార్యమయింది. ఈ ఉదంతాలు అన్నీ ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేశాయి. ప్రస్తుత ఉద్యమం విసురుతున్న సవాల్ స్వభావాన్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నదా లేదా అన్నది ఈ నాటి ఒక ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే ఇది కాంగ్రెస్, రాహుల్‌గాంధీ లేదా కొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలతో వ్యవహరించడమంత తేలికైన విషయం కాదు, బీజేపీకి ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఉన్నది. గత పదేళ్లుగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలలో అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడు సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఉన్నా, లేకపోయినా తమ ప్రత్యర్థులతో సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన సమస్త వనరులు తమకు ఉన్నాయనే ధీమా బీజేపీ నాయకులకు ఉన్నది. అయితే ప్రస్తుత సవాల్ ఒక సంప్రదాయ రాజకీయ పక్షం నుంచి వచ్చింది కాదు. రాజకీయ నాయకుల తీరుతెన్నుల పట్ల ఏ మాత్రం సహనం లేని యువ భారతీయులు విసిరిన సవాల్ అది. సంప్రదాయ రాజకీయ ప్రత్యామ్నాయాలను కూడా వారు విశ్వసించరు. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాలకులతో ఘర్షణపడినప్పుడు వారు కోల్పోయేది కూడా ఏమీ లేదు. మరి ఇటువంటి యువ భారతీయుల నుంచి సవాల్ ఎదురయినప్పుడు పాలకులు ఎలా ప్రతిస్పందించాలి? వారి ఆగ్రహం పాలకులకు పూర్తిగా ఒక భిన్నమైన రాజకీయ సవాల్‌ను విసిరింది, సందేహం లేదు. ప్రతిస్పందన కూడా భిన్నమైన రీతిలో ఉండితీరాలి. అయితే తాము ఎదుర్కొంటున్న శక్తిని మోదీ ప్రభుత్వం తక్కువగా అంచనా వేసిందని భావించేందుకు ఆస్కారమున్నది. గత మేలో సీజేపీ తొలుత ప్రజాజీవితంలో ప్రత్యక్షమయినప్పుడు ప్రభుత్వమూ, దాని మద్దతుదారులు దానిని కొట్టివేశారు, తేలికగా తీసుకున్నారు. గౌరవప్రదంగా లేని పేరు, మీమ్స్ ఆధారిత రాజకీయాలు దానిని దూషణ భూషణలకు గురిచేశాయి. సీజేపీతో వచ్చే ముప్పు ఏమీ లేదని భావించినందునే జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు దానిని అనుమతించారు. అయితే నీట్ ప్రశ్నపత్రాల లీక్ విషయంలోను, తమ భవిష్యత్తు విషయంలోనూ యువ భారతీయుల వ్యాకులత, ఆగ్రహావేశాలు అంత తేలిగ్గా సమసిపోయేవి కావు. సీజేపీ ఉద్యమం విద్యార్థులు, యువజనులకే పరిమితం కాకుండా విశాల ప్రజాశ్రేణుల మద్దతును పొందింది. నీట్ ప్రశ్నపత్రాల వివాదంపై ప్రభుత్వ ప్రతిస్పందన రాజకీయ పర్యవసానాలకు దారితీసింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనివార్యమయింది. ప్రస్తుత ఉద్యమం ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతోంది. ప్రతిపక్షాలు ఉద్యమించీ ఉద్యమించీ అలసిపోయి మిన్నకుండి పోతాయని ప్రభుత్వం భావిస్తుందేమో. కానీ నిరసనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన దృశ్యాలు ప్రజల మనఃఫలకాల నుంచి అంత త్వరగా చెరిగిపోతాయా? యువ నిరసనకారులపై హిందూ రక్షాదళ్ అనే హిందుత్వ బృందం దాడుల విషయమేమిటి? అటువంటి సంఘటనలపై విచారణ తప్పనిసరి. వాటికి జవాబుదారీతనం లేకపోతే ఎలా? మౌనం వహించడం సరికాదు. యువజనులపై పోలీసుదాడుల దృశ్యాలు డిజిటల్ విశ్వంలో వెన్వెంటనే వ్యాపించాయి. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే టీవీ చానెళ్లు సైతం ఆ ఉదంతాలకు సంబంధించిన వార్తల ప్రసారాన్ని ఉపేక్షించలేకపోయాయి. ఇక్కడ తరాల అంతరం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడం నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్న మంత్రులు, రాజకీయవేత్తలు ఉన్న ప్రపంచం... రాజకీయ సమాచారాన్ని స్వతస్సిద్ధంగా సృష్టించి, పంచుకుంటూ, స్పందిస్తున్న యువజనులు ఉన్న ప్రపంచం ఒకటి కావు. అవి పూర్తిగా భిన్నమైనవి. ఒక మంత్రి పక్కా ప్రణాళికతో అత్యంత జాగ్రత్తగా రూపొందించిన సందేశం ప్రజలలోకి విస్తృతంగా వెళ్లవచ్చు. అయితే వారు దానికి ఎలా స్పందించాలో అది నిర్దేశించలేదు. డిజిటల్ ప్రజారంగం ఒక టెలివిజన్ స్టూడియోకు భిన్నమైనది. టీవీ స్టూడియోలో అయితే ఎవరు, ఎప్పుడు మాట్లాడాలో ప్రభుత్వం నిర్ణయించగలదు. డిజిటల్ విశ్వం విషయంలో అటువంటిది కుదరదు. ఈ కారణంగానే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవల్సిన అవసరమున్నది. ప్రజాస్వామిక జవాబుదారీతనం అనేది ఉద్యోగాలు, ధరల పెరుగుదల, పరీక్షల నిర్వహణ, తమ భావి అవకాశాలపై వ్యాకులతల నుంచి వేరుగా ఉండే అంశం కాదని యువ భారతీయులు భావిస్తున్నారు. ఈ దృష్ట్యా ప్రస్తుత ఆందోళనల పట్ల మోదీ ప్రభుత్వం భిన్న దృక్పథంతో వ్యవహరించవలసిన అవసరమున్నది. భారత్ అంటే కేవలం గుజరాత్ మాత్రమే కాదు కదా. గుజరాత్ నమూనా పూర్తిగా ఒక అత్యంత కేంద్రీకృత రాజకీయ నాయకత్వం ప్రాతిపదికన రూపొందింది.

న్యాయం కోసం నిలబడండి

న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలని సూచించారు. వృత్తిలో నిజాయతీగా ఉంటూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం కర్ణాటక బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొని మాట్లాడారు. న్యాయవిద్య అంటే చట్టాలను చదివి తెలుసుకోవడం మాత్రమే కాదని చెప్పారు. విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని వివరించారు. న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూనే, వారి నుంచి ఎన్నో ఆశిస్తున్నానని సూర్యకాంత్ అన్నారు. చట్టాలపై అవగాహన ఉండటంతో పాటు, న్యాయం కోసం నిలబడే ధైర్యం కూడా న్యాయవాదులకు ఉండాలని చెప్పారు. తమ సమస్యలను చెప్పుకోలేని వారి మాటలను కూడా ఓపికగా వినాలని సూచించారు. న్యాయవృత్తి అంత సులభమైనది కాదని సీజేఐ అన్నారు. చట్టాలు, గత తీర్పులపై పట్టు సాధించడంతో పాటు, సరైన విషయాల కోసం ధైర్యంగా పోరాడాలని చెప్పారు. ఇతరుల బాధలను అర్థం చేసుకునే గుణం కూడా ఉండాలని సూచించారు. వృత్తిలో సౌలభ్యం కోసం తమ సూత్రాలను పక్కన పెట్టకూడదని, సులభమైన మార్గాల కోసం తప్పు నిర్ణయాలు తీసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. చదువుకున్న విద్యాసంస్థలో నేర్చుకున్న విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని చెప్పారు. న్యాయవాద వృత్తి ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చని సూర్యకాంత్ తెలిపారు. అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయడం, వ్యక్తుల



స్వేచ్ఛను కాపాడటం, రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా ఎంతో సంతృప్తి పొందవచ్చని అన్నారు. విద్యార్థులు న్యాయవాదులుగా తమ బాధ్యతలను నిర్వర్తించడానికే పరిమితం కాకూడదని సీజేఐ సూచించారు. దేశానికి, సమాజానికి కూడా తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవిద్య పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులు కేవలం చట్టపరమైన విషయాల్లోనే కాకుండా, ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. "న్యాయవాద వృత్తి పిరికివారి కోసం కాదు. చట్టాలు, న్యాయస్థానాలు గతంలో ఇచ్చిన తీర్పులపై పట్టు ఉండడం మాత్రమే సరిపోదు. న్యాయమైన దానిని సమర్థించే ధైర్యం, నిజాయితీ ఉండాలి. న్యాయవాదులకు మేధస్సు ఉంటే సరిపోదు. నిష్పాక్షికత కూడా అవసరం. ఇతరుల వాదనలు వినాలి. ఎదుటి వ్యక్తి గౌరవాన్ని కించపరచకుండానే వారితో విభేదించగలగాలి. నైతిక బాధ్యత కలిగి ఉండాలి. అంతేకాదు ఎంతటి ఒత్తిడినైనా తట్టుకొని స్థిరంగా నిలబడగలగాలి. వృత్తి జీవితంలో ఎక్కడా రాజీపడకూడదు. విలువలకు కట్టుబడి ఉండాలి. నిజాయితీగా ఉంటేనే ఈ వృత్తిలో కీర్తి సుస్థిరంగా ఉంటుంది. రాజీపడాలనే ఆలోచనలు, ప్రలోభాలు, స్వప్రయోజనాలను విడిచిపెట్టాలి. ఒకవేళ అలాంటి సందర్భాలు ఎదురైతే లా కాలేజీల్లో నేర్పిన జ్ఞానాన్నే మీ దిక్సూచిగా చేసుకొని, మీరు ఇక్కడ నేర్చుకున్న విలువలకు కట్టుబడి ఉంటాలి. మీరు ఈ విద్యాలయం నుంచి బయటకు వెళ్తున్నప్పుడు, కేవలం ఒక వృత్తిలోకి వెళ్లడం లేదు. స్వయంప్రతిపత్తికి సంరక్షకులుగా, ప్రజల సేవకులుగా వెళ్తున్నారు. చట్టం మీ సహనాన్ని, నైతికతను పరీక్షిస్తుంది. కానీ తప్పులను సరిదిద్దడం, స్వేచ్ఛను పరిరక్షించడం, రాజ్యాంగాన్ని నిలబెట్టడం మొదలైనవి మీకు సంతృప్తిని అందిస్తాయి."

ఆ విద్యార్థినికి నివాళులు

ఈ స్నాతకోత్సవంలో దివంగత ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ సూర్యకాంత్ నివాళులు అర్పించారు. ఆమె తన ఎల్ఎల్‌బీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ పొందడానికి ముందే మరణించారు. "ఆమె ఈ రోజు ఇక్కడ ఉండి ఉంటే, ఈ డిగ్రీని అందుకుంటూ, తను సాధించిన డిగ్రీ గురించి తన సహచరులతో పంచుకునేది" అంటూ ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సీజేఐ తన సంతాపం తెలియజేశారు. గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాత్రను ఈ సందర్భంగా సీజేఐ గుర్తుచేశారు. విద్యార్థుల విజయాలు వారి కుటుంబాల త్యాగాలు, మద్దతు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "మీరు ఈ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు, దేశం మిమ్మల్ని కేవలం న్యాయవాదులుగానే కాకుండా, ఆశాకిరణాలుగా చూస్తుంది. అందువల్ల మీ వృత్తి జీవితంగా ఉజ్వలంగా, మీ ప్రయత్నాలు ప్రభావవంతంగా, మీ సేవలు శాశ్వతంగా నిలవాలని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

నిలకడగా అడ్వాణీ ఆరోగ్యం
హెల్త్ బులిటెన్ విడుదల చేసిన ఆసుపత్రి

ఛాతీ ఇన్‌ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన బీజేపీ అగ్రనేత, మాజీ ఉపప్రధానమంత్రి ఎల్?కే అడ్వాణీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని తెలిపాయి. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురైన అడ్వాణీని ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఆయన న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

98 ఏళ్ల వయసున్న అడ్వాణీ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఏడాది మేలో కూడా వయో సంబంధిత సమస్యలతో ఆయన ఇదే ఆసుపత్రిలో చేరారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా అడ్వాణీ నివాసానికి వెళ్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మోదీతో అప్యాయంగా మాట్లాడిన అడ్వాణీ కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అయితే, అడ్వాణీ హెల్త్? కండీషన్? గురించి తెలుసుకున్న పలువురు రాజకీయ నేతలు, ఆయన అభిమానులు అడ్వాణీ త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు.

బీజేపీ వ్యవస్థాపక నేతల్లో ఒకరు

ఎల్?కే అడ్వాణీ పూర్తి పేరు లాల్‌కృష్ణ అడ్వాణీ. దేశ



రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు కీలక పాత్ర పోషించారు. అంతేకాదు, కేంద్రంలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చరిత్రలోనే అత్యంత ప్రముఖమైన అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచారు. ప్రారంభంలో ఒక చిన్న రాజకీయ శక్తిగా ఉన్న బీజేపీని, దేశంలోనే అధికార పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి చేర్చడంలో ఆయన పోషించిన పాత్ర కీలకం.

1927 నవంబర్ 8న ఉమ్మడి భారతదేశంలోని కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్?లో ఉంది) నగరంలో జన్మించిన అడ్వాణీ, చిన్న వయసులోనే దేశ విభజన తర్వాత భారతదేశానికి వలస వచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (=ూూ) ద్వారా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి నిబద్ధత గల నాయకుడిగా ఎదిగారు. దేశవ్యాప్తంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయడంలో అడ్వాణీ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 1990లో ఆయన చేపట్టిన దేశవ్యాప్త రామ రథయాత్ర భారత రాజకీయాల్లోనే ఒక చరిత్రాత్మక మలుపుగా నిలిచింది. అంతేకాదు, బీజేపీ రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించడంలో సహాయపడింది. అలా బీజేపీ చరిత్రలోనే అత్యంత ప్రముఖ నాయకుల్లో ఒకరిగా నిలిచారు.

ఉపప్రధానిగా భాధ్యతలు చేపట్టి

అలాగే, పరిపాలనా రంగంలోనూ అడ్వాణీ తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. 2002 నుంచి 2004 వరకు అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో భారతదేశ ఉప ప్రధానమంత్రిగా అడ్వాణీ సేవలు అందించారు. తన రాజకీయ జీవితంలో ఆయన కేంద్ర హోం వ్యవహారాలతో సహా పలు కీలక బాధ్యతలు చేపట్టి, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

భారత రత్న, పద్మ విభూషణ్ పురస్కారాలు

భారత ప్రజా జీవితానికి, దేశ ప్రగతికి అడ్వాణీ చేసిన అసాధారణ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, దేశ అత్యున్నత పురస్కారాలతో ఆయన్ను సత్కరించింది. 2024వ సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ప్రదానం చేసింది. అంతకుముందు, 2015లో ఆయనకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్' వరించింది. ప్రస్తుతం ఆయన బీజేపీలో ఒక సీనియర్? నాయకుడిగా, పార్టీ రాజకీయ చరిత్రలో కీలక వ్యక్తిగా కొనసాగుతున్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్లకు గుడ్ న్యూస్

కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్పీఎఫ్) జవాన్ల పదోన్నతుల్లో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేసింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం రద్దు చేసిన 'లాన్స్ నాయక్', 'నాయక్' ర్యాంకులను తిరిగి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, కానిస్టేబుల్ స్థాయి నుంచి పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న లక్షలాది మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలను సేకరించేందుకు సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం తక్షణ చర్యలు చేపట్టింది. కేవలం రెండు రోజుల్లో వ్యవధిలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో 'సైనిక్ సమ్మేళన్'లు నిర్వహించి, జవాన్ల ఫీడ్‌బ్యాక్ సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 3.25 లక్షల మంది సిబ్బంది కలిగిన సీఆర్పీఎఫ్‌లో ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీఆర్పీఎఫ్‌లో ఒక కానిస్టేబుల్ తన మొదటి పదోన్నతిని (హెడ్ కానిస్టేబుల్‌గా) అందుకోవడానికి సగటున 22 నుంచి 25 ఏళ్ల సమయం పడుతోంది. ఈ సుదీర్ఘ నిరీక్షణ సిబ్బందిలో నైరాశ్యం నింపుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల మధ్య లాన్స్ నాయక్, నాయక్ అనే రెండు అదనపు ర్యాంకులను సృష్టించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 1997లో ఈ ర్యాంకులను రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు. అయితే, భారత సైన్యంలో ఈ ర్యాంకులు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఏడాది చివరి నాటికి



సైన్యంలో నాలుగేళ్ల సేవలు పూర్తిచేసుకుని మొదటి బ్యాచ్ అగ్నివీరులు పదవీ విరమణ చేయనున్నారు. వీరు కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు అర్హత కలిగి ఉంటారు. ఈ తరుణంలో సీఆర్పీఎఫ్‌లో పదోన్నతులు వేగంగా లభిస్తాయనే భరోసా కల్పించడం ద్వారా, నైపుణ్యం గల అగ్నివీరులను పెద్ద సంఖ్యలో ఆకర్షించవచ్చని బలగం భావిస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. నిర్దీత కాల పరిమితిలో పదోన్నతులు కల్పిస్తేనే ఈ సంస్కరణలకు నిజమైన ఫలితం ఉంటుందని పారామిలిటరీ మాజీ సిబ్బంది సంఘం నేత ఒకరు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, కొత్త ర్యాంకుల వల్ల బెటాలియన్ క్రమశిక్షణకు, ఆపరేషనల్ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఓ సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు. మొత్తానికి, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు, అగ్నివీరుల చేరికకు మార్గం సుగమం చేసే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తోంది.

యూపీ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ వ్యూహం..



రానున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోనే పార్టీ ఎన్నికల బరిలోకి దిగాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే బీజేపీ కేంద్ర నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వానికి, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వానికి మధ్య సమన్వయ లోపం, విభేదాలు ఉన్నాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ గత కొంతకాలంగా విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, యోగి నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం ద్వారా, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ప్రస్తుత నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని బలమైన సంకేతాలను పంపినట్లయింది. 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాలకు గాను 300కు పైగా సీట్లు సాధించి బీజేపీ ప్రభంజనం సృష్టించగా, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత 2022 ఎన్నికల్లోనూ 255 స్థానాలతో బీజేపీ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే, ఇటీవలి 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ప్రదర్శన కొంత నిరాశపరిచింది. 2019లో 62 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న పార్టీ, ఈసారి కేవలం 33 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల అనంతరం రాష్ట్ర నాయకత్వం మార్పుపై చర్చలు జరిగినప్పటికీ, అధిష్ఠానం మాత్రం యోగి వైపే మొగ్గు చూపడం గమనార్హం. మరోవైపు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి పార్టీ అధిష్ఠానం నుంచి పూర్తిస్థాయి మద్దతు లభించింది. 2021 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఆయన, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలతో పార్టీని విజయతీరాలకు చేర్చారు. వీటికి తోడు, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని మొత్తం ఐదు స్థానాలను బీజేపీ వరుసగా మూడోసారి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ వరుస విజయాలు ధామి నాయకత్వాన్ని పార్టీలో మరింత సుస్థిరం చేశాయి. తాజా నిర్ణయాలతో రెండు కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నాటికి నాయకత్వంపై నెలకొన్న సందిగ్ధతకు బీజేపీ అధిష్ఠానం తెరదించింది. ముందుగానే నాయకత్వ ముఖచిత్రాలను ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో స్పష్టతనిస్తూ, ఎన్నికల ప్రచారంలోకి దూసుకెళ్లేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ూూూూ) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "వీ+వీ91" అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్జమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" (అూఅఅఐ) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది. ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత: 20 మంది పోలీసుల కిడ్నాప్



పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలోచ్ వేర్పాటువాదులుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న పోలీస్ రిక్రూట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి. మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

తెరపైకి కస్టడీ మరణాల ఆరోపణలు

ఈ దాడుల నేపథ్యంలో, బలూచిస్థాన్‌లో సుదీర్ఘ కాలంగా పాక్ భద్రతా దళాలపై వస్తున్న బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే, పర్వేజ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడి మృతదేహం పాస్నిలో లభ్యమైంది. అంతకు ఒకరోజు ముందు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే పాక్ భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకున్నాయని 'ది బలూచిస్థాన్ పోస్ట్' కథనం ప్రచురించింది. పర్వేజ్ అరెస్టు, మరణంపై పాక్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఇలాంటి ఘటనలు పెరిగాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో, పంజ్‌గూర్‌కు చెందిన హాతిమ్ బలోచ్ అనే మరో ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, కొన్ని వారాల తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా, గత ఏడాది అక్టోబర్‌లో పాక్ బలగాలు అదుపులోకి తీసుకున్న అయాజ్ బలోచ్ అనే ఉపాధ్యాయుడి మృతదేహం ఈ ఏడాది జనవరిలో లభించింది.

నివేదికలో సంచలన విషయాలు

'బలోచ్ యక్‌జెహతీ కమిటీ (బీవైసీ)' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు బలూచిస్థాన్‌లో 507 బలవంతపు అదృశ్యాలు నమోదయ్యాయి. వీరిలో 135 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు ఉండటం గమనార్హం. వీరిలో 32 మంది కస్టడీలోనే మరణించారని ఆ సంస్థ ఆరోపించింది. తాజాగా కిడ్నాప్ ఘటన జరిగిన మస్తుంగ్ జిల్లాలోనే అక్టోబర్ 9న ఓ ఇంటిపై డ్రోన్ దాడి జరగగా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. జనవాసాలపై పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లతో దాడులు చేస్తూ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని బీవైసీ ఆరోపించింది. ఒకవైపు వేర్పాటువాదుల దాడులు, మరోవైపు భద్రతా దళాలపై వస్తున్న తీవ్ర ఆరోపణలతో బలూచిస్థాన్‌లో సామాన్య పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

కనకదుర్గమ్మకు శ్రీవారి సారె సమర్పణ





విజయవాడ, మహానగర్

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున బెజవాడ కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలతో పాటు సారెను సమర్పించారు. టీటీడీ పాలకమండలి సభ్యులు నన్నపనేని సదాశివరావు దంపతులు, జాస్తి సాంబశివరావు దంపతులు పలువురు టీటీడీ ఉద్యోగులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. వారికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపనేని సదాశివరావు మాట్లాడుతూ టీటీడీ పాలకమండలి చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో రవిచంద్ర ఆదేశాల మేరకు అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు సారె సమర్పించినట్లు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, అద్భుతమైన రాజధాని నిర్మాణం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అమ్మవారు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాజధాని నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేలా శక్తిని ఇవ్వాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, దుర్గగుడి పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా సరస్ మేళా





రూ.2 కోట్లకు పైగా వ్యాపారం
రోజూ 50 వేల మందికి పైగా సందర్శకులు
ఎన్ఐఆర్‌డీ అదనపు డైరెక్టర్ సుధీర్ కుమార్

విజయవాడ, మహానగర్

కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (సెర్ప్) సహకారంతో నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాకు విశేష స్పందన లభిస్తోందని ఎన్ఐఆర్‌డీ అదనపు డైరెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. శనివారం పున్నమి ఘాట్‌లోని సరస్ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. చేనేత, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తుల కోసం సుమారు 600 స్టాళ్లు, వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాల కోసం 50 లైవ్ ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతిరోజూ 40 వేల నుంచి 50 వేల మందికి పైగా సందర్శకులు వస్తుండగా, ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు వెల్లడించారు. సందర్శకుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, లాస్ట్ అండ్ ఫౌండ్ కేంద్రాలతో పాటు వివిధ సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఎగుమతి మార్కెటింగ్, వాల్యూ చైన్ నిర్వహణలో శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. లఖ్‌పతి దీదీ పెవిలియన్ మహిళా పారిశ్రామికవేత్తల విజయాలను పరిచయం చేస్తుండగా, డెమో పెవిలియన్‌లో ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తున్నారన్నారు. సెర్ప్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాలు, కళాకారులకు 600 స్టాళ్లను ఉచితంగా కేటాయించామని, పాల్గొనే వారికి ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పిస్తున్నామని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలు, హస్తకళలు, ప్రాంతీయ వంటకాలను ఒకే వేదికపై పరిచయం చేస్తూ గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ఈ మేళా దోహదపడుతోందన్నారు. సమావేశంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ జాయింట్ డైరెక్టర్ ఖటారియా, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.ఎన్.వి. నాంచారరావు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణం
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, మహానగర్





కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ మండపంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెహెర్ నృత్య నికేతన్‌కు చెందిన 25 మంది బాలికలు తమ గురువు దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు పర్యవేక్షణలో అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అన్నమాచార్య కీర్తన 'జగడపు తనువుల జాతర'ను కోలాట రూపంలో ప్రదర్శించి అలరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో నర్తకీమణులు ప్రదర్శించిన కోలాటం, చివరలో స్వామివారు వారితో కలిసి నృత్యం చేసిన సన్నివేశం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దశావతారాలు, నందబాలం, రామదాసు కీర్తన, 'కొలువైతివా' వంటి కూచిపూడి సంప్రదాయ అంశాలతో పాటు దాదాపు 20 నృత్యాంశాలను బాలబాలికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ నృత్య కళాకారులను అభినందించారు. ఆలయ కమిటీ పెద్దలు కొల్లిపర మధు, వరదా రాజశేఖర్, వరదా హరగోపాల్, దింటకుర్తి జ్యోతి, తమ్మన సతీష్ కుమార్ నాట్యాచార్యుడు మెహెర్ దుర్గా నరసింహారావును ఘనంగా సన్మానించారు. చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు.

సోనీ నుంచి కొత్త అల్ట్ పవర్ సౌండ్ పార్టీ స్పీకర్లు



విజయవాడ, మహానగర్

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సోనీ ఇండియా, మెరుగైన ధ్వని, శక్తివంతమైన బాస్‌తో రెండో తరం అల్ట్ పవర్ సౌండ్ పార్టీ స్పీకర్లను విడుదల చేసింది. అల్ట్ టవర్ 5, అల్ట్ టవర్ 7, అల్ట్ టవర్ మ్యాక్స్ మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అల్ట్ టవర్ 5 మోడల్ 300 వాట్ల సౌండ్ అవుట్‌పుట్‌తో పాటు గరిష్ఠంగా 20 గంటల బ్యాటరీ లైఫ్, వాటర్ రెసిస్టెన్స్, ఆకర్షణీయమైన ఎల్ఈడీ లైటింగ్‌ను కలిగి ఉంది. దీని ధర రూ.34,990. అల్ట్ టవర్ 7 మోడల్ 420 వాట్ల శక్తివంతమైన ధ్వని, 360 డిగ్రీల పార్టీ సౌండ్, గరిష్ఠంగా 30 గంటల బ్యాటరీ లైఫ్‌తో రూపొందించారు. దీని ధర రూ.49,990. అత్యంత శక్తివంతమైన అల్ట్ టవర్ మ్యాక్స్ 2,150 వాట్ల సౌండ్ అవుట్‌పుట్, 100 ఎల్ఈడీల లైటింగ్‌తో ఆకట్టుకోనుంది. దీని ధర రూ.1,39,990. డీజే కనెక్టివిటీ, కరాకే సదుపాయాలు, మల్టీ-స్పీకర్ కనెక్షన్లు ఈ మోడళ్ల ప్రత్యేకతలు. అల్ట్ టవర్ 5, అల్ట్ టవర్ 7 మోడళ్లు అక్టోబర్ 8 నుంచి సోనీ రిటైల్ స్టోర్లు, అమెజాన్‌లో అందుబాటులో ఉండగా, అల్ట్ టవర్ మ్యాక్స్ నవంబర్ 15 నుంచి విక్రయానికి రానుంది. లాంచ్ ఆఫర్‌లో భాగంగా ఎంపిక చేసిన మోడళ్లపై క్యాష్‌బ్యాక్ సదుపాయాలను సంస్థ ప్రకటించింది.

అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టు లక్ష్మణరావుకు ఆర్థిక సాయం
భవిష్యత్తులోనూ అండగా ఉంటాం
ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్

గుడివాడ, మహానగర్



గతంలో ఓ ప్రముఖ దినపత్రికలో జిల్లా స్థాయిలో పనిచేసిన జర్నలిస్టు కొమరోలు లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్‌తో పాటు గుడివాడ జర్నలిస్టులు మానవతా దృక్పథంతో స్పందించి ఆయనకు ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మణరావును శనివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ వంతుగా అందించిన ఆర్థిక సహాయం ఆయనకు కొంతైనా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయం అవసరమైనా అండగా ఉంటామని వీర్ల శ్రీరామ్ యాదవ్ భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఆర్థిక సహాయంతో పాటు ఆత్మీయ పలకరింపు, మానసిక ధైర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల మధ్య పరస్పర సహకారం, ఐక్యత, మానవతా విలువలను చాటిచెప్పే ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వీర్ల శ్రీరామ్ యాదవ్, జి. శ్యాంబాబు, డి.వి. కృష్ణారావు, వల్లూరు ప్రసాద్, పీఆర్వో వెంకటేశ్వరరావు, బండారు రాధాకృష్ణ, లగ్గిశెట్టి వెంకట ప్రసాద్, ఉల్లి సాంబశివరావు తదితరులు ఆర్థిక సహాయం అందించారు.

అతివేగం వద్దు.. నిదానమే ప్రాణరక్షణకు మార్గం
- ఎస్ఐ వి. సురేష్



ఆగిరిపల్లి, మహానగర్

నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాల మేరకు, నూజివీడు రూరల్ సీఐ నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ వి. సురేష్ పోలీసు సిబ్బందితో కలిసి శనివారం గ్రామ ప్రధాన కూడలిలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ (ఫుట్ పెట్రోలింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ల వాహన డ్రైవింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని ఎస్ఐ సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అతివేగాన్ని నివారించాలని, "వేగం వద్దు.. ప్రాణం ముద్దు" అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. పెట్రోలింగ్ సందర్భంగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఘటనలను గుర్తించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లతో వాహనాలు నడిపించడం వల్ల జరిగే ప్రమాదాలు, ఎదురయ్యే చట్టపరమైన సమస్యలను వివరించి అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు నేరాల నివారణకు దోహదపడతాయని ఎస్ఐ వి. సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ప్రయాణ సమయంలో తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకుని, వాహనాలను జాగ్రత్తగా నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు.

ఏపీలో సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేషన్ బ్రాండ్స్



గుంటూరు, మహానగర్

పెర్నోడ్ రికార్డ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో సీగ్రామ్స్ ఎక్స్‌క్లామేషన్ బ్రాండ్‌ను ప్రారంభించింది. గత 30 ఏళ్లలో సంస్థ చేపట్టిన ప్రతిష్టాత్మక ఆవిష్కరణల్లో ఇది ఒకటని ప్రకటించింది. విస్కీ, వోడ్కా, జిన్, రమ్, బ్రాందీ అనే ఐదు రకాల స్పిరిట్స్‌ను ఒకే బ్రాండ్ పరిధిలో, ఒకే ధరల శ్రేణిలో అందించడం దీని ప్రత్యేకత. 26--30 ఏళ్ల వయస్సు గల యువ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని, అందుబాటులో ఉండే ప్రీమియం ధరల్లో విభిన్న రుచులను అందించడమే లక్ష్యంగా రూపొందించారు. ప్రతి ఏడాది రెండు కోట్లకు పైగా వినియోగదారులు చట్టబద్ధమైన మద్యపాన వయస్సులోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ బ్రాండ్‌కు అవకాశాలు ఉన్నాయని సంస్థ పేర్కొంది. పెర్నోడ్ రికార్డ్ ఇండియా సీఈఓ జీన్ టోబౌల్ మాట్లాడుతూ, ఆధునిక వినియోగదారుల అభిరుచులు, సామాజిక సమావేశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌క్లామేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఐదు విభాగాల్లోనూ ప్రత్యేకమైన తయారీ విధానాలు, రుచులు, డిజైన్లతో ఉత్పత్తులను అందిస్తున్నట్లు వివరించారు. విస్కీలో స్కాచ్ మాల్ట్, బ్రాందీలో భారతీయ, ఫ్రెంచ్ ద్రాక్ష మిశ్రమం, రమ్‌లో భారతీయ బెల్లం రమ్‌తో పాటు జమైకా స్పిరిట్స్ వినియోగించడం ప్రత్యేకతలని సంస్థ వెల్లడించింది.

బిజినెస్

క్యూ2 ఫలితాలు..

హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐకి లాభాల పంట

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రెండో త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. సెప్టెంబర్‌తో ముగిసిన ఈ ఫలితాల్లో బ్యాంక్ ఏకీకృత నికర లాభం ఐదు శాతానికి పైగా పెరిగి.. రూ.రూ.20,700 కోట్లకు చేరింది. మేరకు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో బ్యాంక్ వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో ఆ మొత్తం రూ.19,611 కోట్లుగా ఉంది దేశంలోని అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.19,510 కోట్లకు చేరింది. గతేడాదితో పోలిస్తే 4.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. బ్యాంక్ ఆదాయం గతేడాదితో పోలిస్తే.. రూ. 91,040 కోట్ల నుంచి రూ.97,258 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు పెరిగాయి. ఆ ఖర్చుల మొత్తం రూ. 63,117 కోట్ల నుంచి రూ. 67,774 కోట్లకు చేరింది. స్థూల నిరర్ధక ఆస్తుల విషయంలో బ్యాంక్ మెరుగైన గణాంకాలను నమోదు చేసింది. వాటి నిష్పత్తి అంతకుముందు త్రైమాసికంలో 1.17 శాతంగా ఉండగా.. తాజాగా 1.11 శాతానికి మెరుగుపడింది.

అదరగొట్టిన ఐసీఐసీఐ..

క్యూ2 ఫలితాల్లో ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ అంచనాలను అధిగమించింది. బ్యాంక్ ఏకీకృత నికరలాభం 22.28 శాతానికి పెరిగి.. రూ.16,333.18 కోట్లుగా నమోదైంది. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.14,843 కోట్లకు పెరిగింది. గతేడాదిపోలిస్తే.. 20.1 వృద్ధిని నమోదు చేసింది. స్థూల నిరర్ధక ఆస్తుల నిష్పత్తి విషయంలో బ్యాంక్ మెరుగుపడింది. గత త్రైమాసికంలో 1.4 శాతంగా ఉన్న నిష్పత్తి తాజా ఫలితాల్లో 1.2 శాతంగా నమోదైంది.

‘బ్రాడ్‌బ్యాండ్.. ఏఐ’.. జియో వృద్ధికి విస్తృత అవకాశాలు

ఇంటర్నెట్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్, టెలికాం విభాగం ‘జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్’ వృద్ధికి, దీర్ఘకాలిక లాభదాయకతకు బలమైన అవకాశాలు ఉన్నాయని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేశాయి. కోట్లాది మంది వినియోగదారులు ఇంకా 2జీ నుంచి అప్‌గ్రేడ్ కావాల్సి ఉండటం, హోం బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ, ఏఐ తదితర టెక్నాలజీల సేవలు, సొంత సాంకేతికతను విదేశాలకు విక్రయించడం వంటివి దీనికి దోహదపడగలవని జీఈపీఎల్ క్యాపిటల్, వెంచ్యురా సెక్యూరిటీస్, ఎస్ఎంసీ గ్లోబల్ సంస్థలు తమ నివేదికల్లో పేర్కొన్నాయి. ఈ నెల 21న రూ.30,213 కోట్ల అంచనాతో జేపీఎల్ ఐపీవో ప్రారంభం కానున్న వేళ ఈ నివేదికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నివేదికల్లోని కీలక అంశాలు..

ఈ ఏడాది జూన్ నాటికి దేశవ్యాప్తంగా 26.1 కోట్ల మంది ఇంకా 2జీ నెట్‌వర్క్‌లోనే ఉన్నారు. రూ.799కి లభించే జియోభారత్ ఫోన్ వంటి ఆఫర్లతో వీరిని ఆకర్షించే అవకాశం



జియో ముందు ఉంది. అదేవిధంగా టారిఫ్ రేషనలైజేషన్, ప్రీమియం ప్లాన్లు, ఓటీటీ, క్లౌడ్ స్టోరేజ్, ఏఐ సేవల ద్వారా వినియోగదారుల నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని మెరుగుపర్చుకోవాలని యోచిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు 21 శాతంగా మాత్రమే ఉన్నాయి. 2031 నాటికి ఇది 46 శాతానికి చేరుకుంటుందని అంచనా. ఈ నేపథ్యంలో కంపెనీ తన మార్కెట్‌ను విస్తరించుకునేందుకు మంచి అవకాశం ఉంది. ఫైబర్ ఆధారిత కనెక్షన్లు కష్టతరమైన ప్రాంతాల్లో ‘జియో ఎయిర్‌ఫైబర్’ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించేందుకు సిద్ధంగా ఉంది. టెలికాం ఆపరేటర్‌గా మాత్రమే కాకుండా.. ఏఐ, టెక్నాలజీ కంపెనీగా జియో ఎదుగుతోంది. ఎండ్-టూ-ఎండ్ 5జీ స్టాండలోన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంతోపాటు 4జీ, 5జీ, 6జీ, ఏఐ రంగాల్లో 7,220 పేటెంట్ దరఖాస్తులను దాఖలు చేసింది. దీని స్వదేశీ ఏఐ ప్లాట్‌ఫామ్ ‘జియోబ్రెయిన్’ నెట్‌వర్క్ కార్యకలాపాలను మెరుగుపరచడమే కాకుండా.. టెక్నాలజీ ఆధారిత ఆదాయాన్ని ఆర్జించేందుకు దోహదపడుతుంది. జియో తన స్వదేశీ 5జీ కోర్, క్లౌడ్ నేటివ్ ఆర్ఏఎన్, జియోబ్రెయిన్ ఏఐ ప్లాట్‌ఫాం వంటి అధునాతన సాంకేతికతలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర టెలికాం ఆపరేటర్లకు విక్రయించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లోకి విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

మురికి టాయిలెట్ ఫొటో పంపితే రూ.1,000 రివార్డు!

జాతీయ రహదారులపై పరిశుభ్రతకు ఎన్‌హెచ్ఏఐ కొత్త కార్యక్రమం..

అక్టోబర్ 31 వరకు ‘క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్’

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజ్‌లలోని మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రయాణికులకు అందుబాటులో ఉండే టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ప్రజలను భాగస్వాములను చేస్తోంది. ఇందులో భాగంగా భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ‘క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజ్‌లలో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్ల ఫొటోలను నిబంధనల ప్రకారం పంపిన వారికి రూ.1,000 వరకు రివార్డు పొందే అవకాశం కల్పించింది.

టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, కుటుంబాలతో ప్రయాణించే వారు, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు మార్గమధ్యంలోని టోల్‌ప్లాజ్‌ల వద్ద అందుబాటులో ఉండే మరుగుదొడ్లను వినియోగిస్తుంటారు. ఇలాంటి సదుపాయాలు పరిశుభ్రంగా ఉండటం ప్రజారోగ్యానికి, ప్రయాణికుల సౌకర్యానికి ఎంతో అవసరం. అయితే కొన్ని ప్రాంతాల్లో టాయిలెట్ల నిర్వహణ సరిగా లేకపోవడం, నీటి కొరత, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వంటి సమస్యలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తుంటాయి. ఈ సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఎన్‌హెచ్ఏఐ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. టోల్‌ప్లాజ్‌లలోని టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తిస్తే, ప్రయాణికులు వాటి ఫొటోలను సమర్పించవచ్చు. అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత ప్రాంతాల్లో పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించేందుకు, నిర్వహణ లోపాలను గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఫొటో ఎలా పంపించాలి?

ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వాహనదారులు అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్‌ను గుర్తించి, సంబంధిత ఫొటోను నిర్దేశించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటోతో పాటు ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంబంధించిన వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో వాహనదారుడి పేరు, టాయిలెట్ ఉన్న ప్రదేశం లేదా లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలు ఉంటాయి. ఈ సమాచారం ద్వారా ఫిర్యాదును గుర్తించడం, సంబంధిత వాహనం వివరాలను పరిశీలించడం సాధ్యమవుతుంది. ఫొటో పంపే సమయంలో అది సంబంధిత టోల్‌ప్లాజ్ టాయిలెట్‌కు సంబంధించినదే అయి ఉండాలి. స్పష్టంగా కనిపించే ఫొటోను సమర్పించడం, సరైన లొకేషన్ వివరాలను నమోదు చేయడం



ముఖ్యం. రివార్డు పొందేందుకు సంబంధిత సంస్థ ప్రకటించిన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. యాప్ పేరు, అప్‌లోడ్ చేసే విధానం, ఫొటోకు సంబంధించిన ఇతర అర్హతలను అధికారిక మార్గదర్శకాల ద్వారా నిర్ధారించుకోవాలి.

ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో బహుమతి

అపరిశుభ్రమైన టాయిలెట్ గురించి నిబంధనల ప్రకారం సమాచారం అందించిన అర్హులైన వారికి రూ.1,000 రివార్డు అందించే అవకాశం ఉంది. ఈ మొత్తాన్ని నగదు రూపంలో కాకుండా, వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌కు అనుసంధానమైన ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో అందించనున్నట్లు ప్రకటించారు. దీంతో వాహనదారులకు టోల్ చెల్లింపుల కోసం ఉపయోగపడే ప్రోత్సాహకం లభిస్తుంది.

అయితే, ఫొటో పంపిన ప్రతి ఒక్కరికీ ఆటోమేటిక్‌గా రివార్డు లభిస్తుందని భావించకూడదు. ఫిర్యాదు అర్హత, ఫొటో నిజమైనదా కాదా అనే పరిశీలన, ఇతర నిబంధనలకు అనుగుణంగా బహుమతి మంజూరు చేసే విధానం ఉంటే వాటిని పాటించాల్సి ఉంటుంది. రివార్డు మంజూరుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక ప్రకటనలో పరిశీలించడం అవసరం.

ఎక్కడి టాయిలెట్లకు వర్తిస్తుంది?

ఈ కార్యక్రమం విషయంలో ఎన్‌హెచ్ఏఐ స్పష్టమైన పరిమితిని విధించింది. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజ్‌ల నిర్వహణలో భాగంగా అందుబాటులో ఉండే టాయిలెట్లకు మాత్రమే ఈ రివార్డు పథకం వర్తిస్తుంది. పెట్రోల్ బంకులు, దాబాలు, హోటళ్లు, ఇతర ప్రైవేటు ప్రదేశాల్లోని మరుగుదొడ్లకు ఇది వర్తించదు. అందువల్ల ఫొటో పంపే ముందు సంబంధిత టాయిలెట్ ఈ కార్యక్రమ పరిధిలోకి వస్తుందో లేదో నిర్ధారించుకోవాలి.

అక్టోబర్ 31 వరకు అవకాశం

అందుబాటులో ఉన్న ప్రకటన వివరాల ప్రకారం, ఈ ‘క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్’ కార్యక్రమం అక్టోబర్ 31 వరకు కొనసాగనుంది. గడువులోగా అర్హత కలిగిన ఫిర్యాదులను సమర్పించేందుకు వాహనదారులకు అవకాశం ఉంటుంది. అయితే కార్యక్రమానికి సంబంధించిన తాజా గడువు, అధికారిక యాప్, రివార్డు పొందే విధానం వంటి వివరాలను ఎన్‌హెచ్ఏఐ అధికారిక ప్రకటనల ద్వారా మరోసారి నిర్ధారించుకోవాలి.

స్పోర్ట్స్

వర్షార్పణమైన భారత్-వెస్టిండీస్ ఐదో టీ20

2-2తో ముగిసిన ఐదు మ్యాచ్‌ల సిరీస్.. నిర్ణయాత్మక పోరుకు వరుణుడి అడ్డంకి!

బెంగళూరు: భారత్--వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్ చివరి పోరు వర్షం కారణంగా రద్దయింది. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో శనివారం (అక్టోబర్ 17) జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్‌కు వరుణుడు పదేపదే అంతరాయం కలిగించడంతో విజేతను నిర్ణయించడం సాధ్యపడలేదు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2--2తో సమంగా ముగిసింది. ఇరు జట్లు చెరో రెండు విజయాలు సాధించగా, చివరి మ్యాచ్ ఫలితం తేలకపోవడంతో సిరీస్ విజేత ఎవరనే ఉత్కంఠకు తెరపడింది.

తొమ్మిది ఓవర్లకు కుదించిన మ్యాచ్.. అయినా తప్పని వర్షం

నిర్ణయాత్మక మ్యాచ్ ప్రారంభానికి ముందే బెంగళూరులో వర్షం ఆటకు ఆటంకంగా మారింది. వాస్తవానికి ఈ మ్యాచ్ పూర్తి స్థాయిలో జరిగి ఉంటే సిరీస్ విజేత ఎవరో తేలేది. అయితే వాతావరణం సహకరించకపోవడంతో మ్యాచ్ నిర్వహణకు అధికారులు పలు ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. వర్షం కారణంగా ఆట ప్రారంభం ఆలస్యమైంది. చివరకు ఇరు జట్ల ఇన్నింగ్స్‌లను తొమ్మిది ఓవర్లకు కుదించి మ్యాచ్‌ను నిర్వహించాలని నిర్ణయించారు.

టాస్ గెలిచిన వెస్టిండీస్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు బ్యాటింగ్‌కు దిగింది. తక్కువ ఓవర్లలోనే భారీ స్కోరు సాధించాలనే లక్ష్యంతో భారత బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేశారు. పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వర్షం కారణంగా కుదించిన మ్యాచ్ కావడంతో ప్రతి ఓవర్ కీలకంగా మారింది. బ్యాటర్లు వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించేందుకు ప్రయత్నించగా, వెస్టిండీస్ బౌలర్లు వికెట్లు తీసి భారత జట్టు స్కోరును నియంత్రించేందుకు యత్నించారు.

7.4 ఓవర్లలో 118 పరుగులు

భారత జట్టు బ్యాటింగ్ కొనసాగుతున్న సమయంలో వర్షం మళ్లీ అంతరాయం కలిగించింది. ఆట నిలిచిపోయే సమయానికి భారత్ 7.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసింది. తక్కువ సమయంలోనే భారత జట్టు మంచి స్కోరు సాధించడంతో మిగిలిన ఓవర్లలో మరిన్ని పరుగులు జోడించే అవకాశం కనిపించింది. ముఖ్యంగా చివరి ఓవర్లలో బ్యాటింగ్ వేగాన్ని మరింత పెంచేందుకు భారత జట్టుకు అవకాశం ఉండేది.

కానీ వర్షం తీవ్రత పెరగడంతో ఆటను తిరిగి ప్రారంభించడం సాధ్యం కాలేదు. మైదాన పరిస్థితులను పరిశీలించిన



అధికారులు మ్యాచ్‌ను కొనసాగించలేమని నిర్ణయించారు. దీంతో కీలకమైన ఐదో టీ20 మ్యాచ్ ఫలితం తేలకుండానే రద్దయింది.

సమంగా సాగిన సిరీస్.. విజేత లేకుండానే ముగింపు

ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, వెస్టిండీస్ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. ఇరు జట్లు చెరో రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించడంతో చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించే కీలక పోరుగా మారింది. స్వదేశంలో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ భావించగా, భారత గడ్డపై సిరీస్ విజయం సాధించాలనే లక్ష్యంతో వెస్టిండీస్ బరిలోకి దిగింది. అయితే చివరి మ్యాచ్‌లో వర్షం కారణంగా ఇరు జట్లకు తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం దక్కలేదు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌ల ఫలితాల ద్వారా ఇరు జట్ల బలాబలాలు స్పష్టమైనప్పటికీ, ఐదో మ్యాచ్ రద్దు కావడంతో ఆధిపత్యాన్ని నిరూపించుకునే తుది అవకాశం చేజారింది. ఫలితంగా సిరీస్ 2--2తో సమంగా ముగిసింది.

అభిమానులకు నిరాశ

నిర్ణయాత్మక మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూసిన క్రికెట్ అభిమానులకు వర్షం నిరాశ మిగిల్చింది. చివరి మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకునే అవకాశం రెండు జట్లకూ ఉండటంతో ఈ పోరుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ప్రకృతి సహకరించకపోవడంతో మ్యాచ్ మధ్యలోనే ముగిసింది.

మొత్తంగా భారత్--వెస్టిండీస్ టీ20 సిరీస్ హోరాహోరీగా సాగినా, చివరి మ్యాచ్ రద్దుతో సిరీస్ విజేతను నిర్ణయించలేకపోయారు. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో సిరీస్‌ను సమంగా ముగించాయి. కీలకమైన చివరి పోరులో బ్యాటర్లు, బౌలర్లు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించే అవకాశం లేకపోవడం ఈ మ్యాచ్‌లో ప్రధాన నిరాశగా నిలిచింది.

ఐపీఎల్ 2027 వేలానికి ముహూర్తం ఖరారు..


ఐపీఎల్ 2027 వేలానికి తేదీ, వేదిక ఖరారు

డిసెంబర్ 16న గోవాలో జరగనున్న ఆక్షన్

మూడేళ్ల విరామం తర్వాత భారత్‌లో ఐపీఎల్ వేలం

ఫ్రాంచైజీల కోరిక మేరకే స్వదేశంలో నిర్వహణ

ఆటగాళ్ల జాబితా, పర్స్ వివరాలు త్వరలో వెల్లడి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు బీసీసీఐ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన వేలం తేదీని, వేదికను బోర్డు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేలం ప్రక్రియ డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనుంది. ఈ మేరకు మొత్తం 10 ఐపీఎల్ ఫ్రాంచైజీలకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి శనివారం సమాచారం అందినట్లు తెలుస్తోంది. గోవాలోని ఐటీసీ గ్రాండ్ హోటల్ ఈ వేలానికి ఆతిథ్యం ఇవ్వనుంది. వేలానికి ఒక రోజు ముందు, అంటే డిసెంబర్ 15న ఫ్రాంచైజీల ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా బ్రీఫింగ్ సెషన్ నిర్వహించనున్నారు. బీసీసీఐ లాజిస్టిక్స్ బృందం ఇప్పటికే వాట్సాప్ సందేశం ద్వారా ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించగా, దీనిపై అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా ధ్రువీకరణ రావాల్సి ఉంది. గత మూడు సీజన్లుగా ఐపీఎల్ వేలం విదేశీ గడ్డపైనే నిర్వహించారు. 2024 సీజన్ కు దుబాయ్, 2025 సీజన్ కు జెద్దా, 2026 సీజన్ కు అబుదాబి నగరాలు ఈ వేలానికి ఆతిథ్యమిచ్చాయి. ఈ క్రమంలో మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్ వేలం తిరిగి భారత్‌లో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాంచైజీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న బోర్డు, ఈసారి స్వదేశంలోనే వేలం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వంటి అధికారులు డిసెంబర్ మధ్యలో గోవాలో వేలం జరపవచ్చని సంకేతాలిచ్చారు.



వాళ్లు క్లిక్ అయ్యారు.. మరి ఏ జూడ్ ఏం చేస్తాడో?

తెలుగులో బోలెడంత మంది యూట్యూబర్లు ఉన్నారు. రోజువారీ దైనందిన విషయాల గురించి ప్రతిరోజూ వీడియోలు చేస్తూ 'ఏ జూడ్' అనే ఛానెల్‌తో అజయ్ అనే యూట్యూబర్ గుర్తింపు తెచ్చుకున్నాడు. గత రెండు వారాలుగా ఎలాంటి వీడియోలు గానీ పోస్టులు గానీ పెట్టని ఇతడు.. సడన్‌గా హీరో అయిపోయాడు. శనివారమే ఇతడి మూవీ లాంచ్ అయింది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. రాము కొప్పుల దర్శకత్వంలో నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల నిర్మిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతమందిస్తున్నాడు. యూట్యూబ్ కమ్యునిటీ నుంచి వచ్చి హీరో అయినవాళ్లలో ఏ జూడ్ మొదటివాడేం కాదు. లిటిల్ హార్ట్ ఫేమ్ మౌళి, సుహాస్, సుమంత్ ప్రభాస్ తదితరులు.. యూట్యూబ్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చి నిలదొక్కుకున్నవాళ్లే. మరి వీళ్లలా అజయ్ అలియాస్ ఏ జూడ్ సక్సెస్ అవుతాడా లేదా అనేది చూడాలి?

'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల.. జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!



నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్' సుగి విజయ్, జుష్ణి భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. "ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోష్ణు, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

పల్లెటూరి నుంచి అంతరిక్షం వరకు.. దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్!



యువ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్/డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' పవన్ సాధినేని దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. చదువంటే ఇష్టమున్న ఒక అమ్మాయి పల్లెటూరి నేల నుంచి మొదలై ఏకంగా అంతరిక్షం వరకు సాగే ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణంగా ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక నటిస్తుండగా, శృతి హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన విజువల్స్ తో రూపొందుతున్న ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

షూటింగ్ పూర్తి చేసుకున్న పూరి- విజయ్ సేతుపతి 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్!



క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ అయింది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకులను భావోద్వేగాల సుడిగండంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండబోతోందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. విజయ్ సేతుపతి -- పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై సినిమా వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



కీర్తి సురేశ్ బర్త్‌డే స్పెషల్.. 'అక్క' యాక్షన్ ప్యాక్డ్ టీజర్ విడుదల!

టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా వరుస అప్‌డేట్లు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే వెంకీ సినిమా నుంచి క్రేజీ అప్‌డేట్ రాగా, తాజాగా ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'అక్క' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా వస్తున్న ఈ సినిమా టీజర్ పూర్తిగా యాక్షన్ ప్యాక్డ్‌గా, ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్‌తో పాటు మరో టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఇద్దరు పవర్‌ఫుల్ నటీమణుల కలయికలో వస్తున్న ఈ థ్రిల్లర్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త లుక్‌లో, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో కీర్తి సురేశ్ కనిపించనున్న ఈ టీజర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999